
నినాదం
నిఖార్సైన జర్నలిజం
మంగళవారం 12 నవంబర్ 2024 తెలంగాణ ప్రాంతీయం పేజీలు 12

# పొలం పనులో రైతులు!

## కుటుంబ సర్వేలో ఎన్యుమరేటర్లు

### ఇంటికి తాళం వేసి వ్యవసాయ క్షేత్రాల్లోకి..

పత్తి, వరికోత, ధాన్యం ఆరబోతలో బిజీబిజీ



ఇబ్బందులు పడుతున్న ఎన్యుమరేటర్లు
పూర్తి వివరాలు చెప్పేందుకు వెనుకాడుతున్న జనం
సమగ్ర సర్వేపై అనుమానాలు ఎన్నో...?
గతంలో చేసిన సర్వేల సంగతేంటి అంటూ ప్రజల నుండి ప్రశ్నలు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజల నుంచి స్పందన అంతంత మాత్రంగానే వస్తున్నది.నిన్నా మొన్నటి వరకు కులాలు, మాతృ బాషలపై పోస్టులు సోషల్ మీడియాలో వైరల్ కాగా ఈనెల శనివారం నుంచి మొదలైన ఇంటింటి సర్వేపై కొన్ని చోట్ల ప్రజలు ఆసక్తి చూపడం లేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఒక్కరోజు కుటుంబ సర్వే చేపట్టిన విషయం తెలిసిందే. మళ్లీ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కుటుంబ ఆర్థిక, విద్య, ఉద్యోగ, ఉపాధి, స్థిర ఆస్తులపై సర్వేను ప్రారంభించింది. అయితే గత ప్రభుత్వం చేసిన సర్వేతో తమకు ఏమీ లబ్ది జరుగలేదు. ఈసారి మళ్లీ మీరు చేస్తే ఏం వస్తుందనే అభిప్రాయాలను సర్వే అధికారుల ముందు జనం వెల్లబోస్తున్నారు.సూర్యాపేట జిల్లాలో అర్బన్ ప్రాం తాల్లో నివసిస్తున్న ప్రజలు కొంత అందుబాటులో ఉన్నప్పటికీ, రూరల్ ప్రాంతాల్లో ఉండే ప్రజలు పొలం పనుల్లో బిజీ బిజీగా ఉన్నారు. దీంతో ఎన్యుమరేటర్లు ఇంటికి వెళ్లిచూడగా.. ఎవరూ ఉండకపోవడంతో సర్వే చేయడానికి అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని వారు వాపోతున్నారు.

వివరాలు 5లో

- కోదాడ, నవంబర్ 11(నినాదం న్యూస్)

# రైతు సంక్షేమమే ప్రభుత్వ సంకల్పం..

27 రోజుల్లో రూ. 18 వేల కోట్ల రుణమాఫీ.. మంత్రి పొంగిలేటి



ఖమ్మం, నవంబర్11, (వినాధం న్యూస్): ప్రభుత్వం రైతు కళ్ళల్లో ఆనందం చూడడానికి, రైతు సంక్షేమానికి చిత్తశుద్ధితో పనిచేస్తుందని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం మంత్రి ఖమ్మం రూరల్ మండలం చిన్నవెంకటగిరి గ్రామంలో పర్యటించి అభివృద్ధి పనులకు శంఖుస్థాపన, లబ్దిదారులకు కళ్యాణాలక్ష్మి/షాదీముబారక్ చెక్కుల పంపిణీ చేశారు.మంత్రి చిన్నవెంకటగిరి గ్రామం ఎస్సి/బిసి కాలనీలో రూ.13లక్షల వ్యయంతో, ప్రాథమిక పాఠశాల వద్ద రూ. 21 లక్షల వ్యయంతో చేపట్టనున్న సిసి రోడ్, డ్రెయిన్ల నిర్మాణ పనులకు శంఖుస్థాపన చేశారు. ఖమ్మం రూరల్ మండలానికి చెందిన 37 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి/షాదీముబారక్ చెక్కుల పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రైతు కళ్ళల్లో ఆనందానికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 2 లక్షల రుణమాఫీ చేపట్టిందని, 27 రోజుల్లోనే రూ. 18 వేల కోట్ల రుణమాఫీ చేసిందని, ఇంకా13 వేల కోట్ల రుణమాఫీ డిశంబర్ మాసంలోగా పూర్తి చేస్తుందని అన్నారు. గతంలో ఇందిరమ్మ ప్రభుత్వం 19,36,000 ఇండ్లు కడితే, ఇప్పుడు మొదటి విడతగా 4,50,000 ఇందిరమ్మ ఇళ్ళు ఇస్తుందని, రాబోయే 4 సంవత్సరాల్లో 20 లక్షల ఇండ్ల లక్ష్యంగా అందిస్తుందని అన్నారు. ప్రభుత్వం విద్య, వైద్యానికి పెద్దపీట వేస్తుందని, పేదోడి పిల్లవాడికి మంచి విద్య అందేట్లు అనేక సంస్కరణలు చేపట్టిందని, అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమం క్రింద రూ. 657 కోట్లు ఖర్చు పెట్టి, పాఠశాలల్లో మౌళిక సదుపాయాల కల్పన చేసిందని అన్నారు. పూర్తి పారదర్శకంగా 40 వేల మందికి ప్రమోషన్లు, బదిలీలు చేపట్టిందని, మెగా డిఎస్సి ద్వారా 11 వేల 56 టీచర్ ఉద్యోగాల నియామకం చేసిందని మంత్రి అన్నారు. 40 శాతం మేర మెస్ చార్జీలు పెంచిందని, కాస్మెటిక్ చార్జీలు పెంపుదల చేసిందని మంత్రి తెలిపారు.

ఈ రేస్ కార్లలో అవకతవకలు జరిగాయని ప్రభుత్వం గుర్తించి, చట్ట ప్రకారం ప్రజాప్రతినిధిని ప్రశ్నించుటకు గవర్నర్ అనుమతికి 13 రోజుల క్రిందట లేఖ వ్రాసామని, ఇంకనూ బదులు రాలేదని మంత్రి అన్నారు. గత ప్రభుత్వం ప్రజా ధనాన్ని పెద్ద ఎత్తున దుర్వినియోగం చేసిందని, అవినీతి జరిగిన ప్రతిచోటా చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని, దోషులు తప్పించుకోలేరని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతి రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ట్రైబల్ యూనివర్సిటీ మంజూరికి కృషి

మూతబడ్డ డిఈడి కళాశాలను పునర్ ప్రారంభిస్తా...
జాతీయ విద్య దినోత్సవం సందర్భంగా పలువురి ఉపాధ్యాయులకు సన్మానం
ఉట్నూర్ మండల కేంద్రంలో అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి విస్తృత ప్రచారం



కరీంనగర్, నవంబర్ 11(నినాదం న్యూస్ ): రానున్న పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిపిస్తే ఉట్నూర్ మండల కేంద్రం లో ట్రైబల్ యూనివర్సిటీ గిరిజన విశ్వవిద్యాలయం మంజూరు కి కృషి చేస్తానని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ డాక్టర్ వి.నరేందర్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం ఉట్నూరు మండల కేంద్రంలో పలు ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలతో పాటు గ్రంథాలయంలో పలువురు ఉపాధ్యాయులను పట్టభద్రులను ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి కలసి రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మద్దతు తెలుపాలని కోరారు.అనంతరం పాత్రికేయుల సమావేశం నిర్వహించారు.

5లో


## ఏరు దాటాక తెప్ప తగలేసినట్లుగా ఉంది..

వార్షిక బడ్జెట్‌పై వైసీపీ ఎమ్మెల్సీ సెటైర్లు



5లో

# హైడ్రా కూల్చివేతలతో సున్నం చెరువు పరిశీలన



**హైదరాబాద్ (నినాదం):** మాదాపూర్ సున్నం చెరువులో హైడ్రా కూల్చివేతలతో రెండు నెలలుగా కరెంట్ లేక స్థానిక బాధితులు తీవ్ర ఇబ్బందులకు గురువుతున్నారు. బాధితులు చిన్న పిల్లలతో రాత్రివేళల్లో బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం 'నమస్తే'లో అక్కడి పరిస్థితులను వివరిస్తూ.. 'బతుకంతా చీకటైంది' పేరిట కథనం రాగా, ట్రాన్స్ కో అధికారులు స్పందించారు. ఏడీఈ మల్లేషం, ఏఈ సత్యనారాయణ సిబ్బందితో కలిసి సున్నం చెరువును సందర్శించి.. కరెంట్ స్తంభాలను పరిశీలించిన అనంతరం బాధితులతో మాట్లాడారు. హైడ్రా కూల్చివేతల అనంతరం సున్నం చెరువుకు రెండు నెలల నుంచి కరెంట్ లేకపోవడంతో బాధితులు కోర్టును ఆశ్రయించగా, న్యాయస్థానం నుంచి వచ్చిన ఆర్డర్ కాపీని తమకు అందించమని ఏడీఈ మల్లేషం బాధితులను కోరారు. పై స్థాయి అధికారులకు సున్నం చెరువు పరిస్థితులపై నివేదిక పంపి సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని ఏడీఈ మల్లేషం బాధితులతో చెప్పారు. బాధితులు వారి వద్ద ఉన్న పత్రాలను ఏడీఈ మల్లేషంకు చూపించగా, 'విద్యుత్ సమస్యను త్వరలోనే పరిష్కరించేందుకు మా వంతు ప్రయత్నం చేస్తాం' అని చెప్పినప్పటికీ కరెంట్ విషయంలో భరోసాను ఇవ్వకపోవడంతో బాధితులు అసహనం వ్యక్తం చేశారు.

## చైనా సంస్థ స్పేస్ ట్రాన్స్‌పోర్టేషన్ తయారీ!

**శబ్దానికి 9 రెట్ల వేగంతో వెళ్లే విమానాల అభివృద్ధి దిశగా అమెరికన్ కంపెనీల కృషి**



"ఎనభై రోజుల్లో భూప్రదక్షిణ".. ఎప్పుడో విమానాలు లేని రోజుల్లో, 1872లో ప్రఖ్యాత ఫ్రెంచ్ రచయిత జూల్స్‌వెర్న్ రాసిన కాల్పనిక నవల పేరు ఇది! ఆయన ఆ నవల రాసిన వందేళ్ల తర్వాత.. శబ్దం కన్నా ఎక్కువ వేగంతో (సూపర్‌సానిక్) ప్రయాణించే కంకార్డ్ విమానాలు గాల్లో ఎగిరాయి. 1986 నవంబరులో బ్రిటిష్ ఎయిర్‌వేస్‌కు చెందిన ఓ కంకార్డ్ విమానం.. 29 గంటల 59 నిమిషాల్లో భూప్రదక్షిణం చేసింది. ఇప్పుడు వాటినిమించి.. శబ్దవేగానికి ఐదు రెట్ల (హైపర్‌సానిక్) వేగంతో ప్రయాణించే విమానాల తయారీకి కృషి జరుగుతోంది. చైనాకు చెందిన 'స్పేస్ ట్రాన్స్‌పోర్టేషన్' కంపెనీ ఇటీవలే ఆ దిశగా ఒక అడుగు ముందుకు వేసింది. శబ్దానికి నాలుగు రెట్ల వేగంతో ప్రయాణించే విమానాన్ని తయారుచేసింది. దాదాపుగా గంటకు 5 వేల కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే ఈ విమానంలో భూప్రదక్షిణ చేయడానికి జస్ట్ 7 గంటలు పడుతుందంతే!! శబ్దానికి ఐదు రెట్లు, అంతకుమించిన (మ్యాక్ 5) వేగంతో ఖండాలు దాటి దూసుకెళ్లి లక్ష్యాలను ఛేదించే హైపర్ సానిక్ క్షిపణులు ఇప్పటికే అందుబాటులోకి వచ్చాయిగానీ.. అతి తక్కువ సమయంలో సుదూరతీరాలకు ప్రయాణికులను తీసుకెళ్లే వాణిజ్య హైపర్‌సానిక్ విమానాలు మాత్రం చాలాకాలంగా ప్రయోగాల దశలోనే ఉన్నాయి. చైనాకు చెందిన 'స్పేస్ ట్రాన్స్‌పోర్టేషన్ (ఈ కంపెనీ చైనా నామధేయం.. 'లింకాంగ్ టియాన్సింగ్ టెక్నాలజీ')' సంస్థ ఆ దిశగా ఒకడుగు ముందుకు వేసినట్టు 'సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్' వార్తాసంస్థ ఇటీవల ఒక కథనాన్ని వెలువరించింది. ఈ కంపెనీ తయారుచేసిన వాణిజ్య విమాన నమూనా శబ్దానికి నాలుగు రెట్ల వేగాన్ని సాధించినట్టు అందులో పేర్కొంది. శబ్దవేగం గంటకు 1234.8 కిలోమీటర్లు.
దానికి నాలుగు రెట్లంటే.. దాదాపుగా గంటకు 5 వేల కిలోమీటర్లు. లండన్ నుంచి న్యూయార్క్‌కి కంకార్డ్ (సూపర్‌సానిక్) విమానంలో అయితే 2 గంటల 53 నిమిషాల సమయం పట్టేది. ఈ విమానంలో అయితే గంటన్నరలో వెళ్లిపోవచ్చు. అలాగే.. లండన్ నుంచి సిడ్నీకి ప్రస్తుతం అందుబాటులో ఉన్న విమానాల్లో అయితే సుమారుగా 22 గంటల సమయం పడుతుంది.

అదే ఈ చైనా కంపెనీ తయారుచేసిన విమానంలో అయితే కేవలం నాలుగు గంటల లోపే పడుతుందన్నమాట. ఈ విమానం 2027 నాటికి ప్రయాణికులకు అందుబాటులోకి వస్తుందని అంచనా. అన్నట్టు.. ఈ విమానికి సదరు చైనా కంపెనీ పెట్టిన పేరు యున్సింగ్. అంటే పరుగుతీయడం అని అర్థం. ఒక్క చైనా కంపెనీయేకాదు.. అమెరికాకు చెందిన వీనస్ ఏరోస్పేస్ కంపెనీ.. 'స్టార్‌గేజర్' అనే హైపర్‌సానిక్ విమానాన్ని అభివృద్ధి చేస్తోంది. 2030 నాటికి అందుబాటులోకి వచ్చే ఈ విమానం.. మ్యాక్ 9 (శబ్దవేగానికి 9 రెట్లు) వేగంతో ప్రయాణిస్తుందని, ఢిల్లీ నుంచి లండన్‌కు కేవలం గంటలో వెళ్లిపోతుందని (ఇప్పుడు 9 నుంచి 10 గంటలు పడుతోంది) దాని రూపకర్తలు చెబుతున్నారు. అంటే.. సరదాగా మధ్యాహ్న భోజనం వేళకు తాజ్‌మహల్‌ని సందర్శించి సాయంత్రం లండన్‌లో బిగ్‌బెన్ గడియారాన్ని చూస్తూ టీ రుచిని ఆస్వాదించవచ్చన్నమాట. ఇలాగే.. అమెరికాకు చెందిన బూమ్‌సానిక్ సంస్థ కూడా హైపర్‌సానిక్ విమానాల తయారీకి చాలాకాలంగా కృషిచేస్తోంది

## సాహిబాలో మెరిసిన విజయ్



స్టార్ హీరో దేవరకొండ విజయ్ ఓ మ్యూజిక్ ఆల్బమ్‌లో నటించారు. 'హీరియే..' సాంగ్‌తో గుర్తింపు తెచ్చుకున్న మ్యూజిక్ కంపోజర్, సింగర్ జస్లీన్ రాయల్ రూపొందించిన కొత్త పాట 'సాహిబా'లో విజయ్ దేవరకొండ నటించారు. ఆయనకు జోడీగా రాధిక మదన్ కనిపించనున్నారు. సుధాంశు సరియా ఈ మ్యూజిక్ ఆల్బమ్‌కి దర్శకుడు. సోమవారం విడుదల చేసిన ఈ సాంగ్ ప్రోమోలో దేవరకొండ విజయ్ ఫొటోగ్రాఫర్‌గా కనిపించారు. 'సాహిబా' కంప్లీట్ మ్యూజిక్ వీడియో ఈ నెల 15న విడుదల కానుంది.

# మానవత్వంతో మహిళ ప్రాణాన్ని కాపాడిన కేంద్ర మంత్రి సంజయ్

**వైద్య ఖర్చులు తామే బరిస్తానని డాక్టర్స్‌కు చెప్పిన మంత్రి**

**కరీంనగర్, నవంబర్ 11(నినాదం న్యూస్ )** మానకొండూరు మండలం.కెల్లేడు గ్రామానికి చెందిన దివ్యశ్రీ అనే మహిళ ప్రమాద వశస్తూ లారీ కింద పడి టైరు చక్రంలో ఇరుక్కుకోని ప్రాణ బయంతో కేకలు వేయడంతో అటుగా ములుగు వెళ్లుచున్నా కేంద్ర మంత్రి ఘటన స్థలం వద్ద ఆగిన బండి సంజయ్ లారీని వెంబడించగా లారీ చక్రం లో ఇరుకున్న మహిళను కాపాడారు. మహిళ ను లారీ ఇడ్చుకొంటూ వెళ్ళి హుజూరాబాద్ సమీపంలోని సింగాపూర్ శివారులో కొద్దిదూరం వెళ్లాక లారీని ఆపేసిన డ్రైవర్ హుటా,హుటిన లారీ వద్దకు వెళ్లిన మంత్రి



లారీ కింద టైర్ పక్కన రాద్దులో జుట్టు చిక్కుకుని రక్తమోడుతూ,వెళాడుతున్న దివ్యశ్రీని చూసిన సంజయ్ ధైర్యం చెప్పారు.

భయపడొద్దు,ధైర్యంగా ఉండాలని నేనున్నానని సూచించిన మంత్రి అటువైపు వెళుతున్న, లారీలను ఆపి జాకీలు, కత్తెర తెప్పించి ప్రాణాలతో విలవిల్లాడుతున్న మహిళను కాపాడేందుకు క్రుషి చేశారు. మంత్రి సూచనతో జుట్టు కత్తిరించి ప్రాణాలను కాపాడిన స్థానికులు ఆ తల్లిని చూసి భోరున విలపించిన పిల్లలు బోరున ఏడ్చారు వారికి ధైర్యం చెప్పి గాయాలపాలైన మహిళను కరీంనగర్ లోని లైఫ్ లైన్ ప్రైవేట్ ఆసుపత్రికి పంపిన మంత్రి డాక్టర్స్ తో మాట్లాడి దివ్యశ్రీ చికిత్సకు అయ్యే ఖర్చును తానే చెల్లిస్తానని ఆసుపత్రి వైద్యులకు చెప్పారు.

# ట్రైబల్ యూనివర్సిటీ మంజూరికి కృషి

- **మూతబడ్డ డిఈడి కళాశాలను పునర్ ప్రారంభిస్తా...**
- **జాతీయ విద్య దినోత్సవం సందర్భంగా పలువురి ఉపాధ్యాయులకు సన్మానం**
- **ఉట్నూర్ మండల కేంద్రంలో అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి విస్తృత ప్రచారం**



**కరీంనగర్, నవంబర్ 11(నినాదం న్యూస్ )** రానున్న పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిపిస్తే ఉట్నూర్ మండల కేంద్రం లో ట్రైబల్ యూనివర్సిటీ గిరిజన విశ్వవిద్యాలయం మంజూరు కి కృషి చేస్తానని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ డాక్టర్ వి.నరేందర్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం ఉట్నూరు మండల కేంద్రంలో పలు ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలతో పాటు గ్రంథాలయంలో పలువురు ఉపాధ్యాయులను పట్టభద్రులను ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి కలసి రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మద్దతు తెలుపాలని కోరారు.అనంతరం పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదిలాబాద్ కు గిరిజన విశ్వవిద్యాలయం వచ్చినట్టే వచ్చి చివరి నిమిషంలో చేజారిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.ఉత్తర తెలంగాణలో కరీంనగర్ వరంగల్ నిజాంబాద్ లకు యూనివర్సిటీలు ఉన్నాయని ఆదిలాబాద్ జిల్లాకు ఒక్క యూనివర్సిటీ లేకపోవడం బాధాకరమనిఅన్నారు. రానున్న రోజుల్లో ఆదిలాబాద్ జిల్లాకు ఒక యూనివర్సిటీతో పాటు గిరిజన విశ్వవిద్యాలయం తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తానని అన్నారు. అదిలాబాద్ జిల్లాలో డిగ్రీ కళాశాలలు లేక విద్యార్థులు దూర ప్రాంతాలకు వెళ్లి చదువుకుంటున్నారని వారి ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని అదిలాబాద్ జిల్లాలో మరిన్ని డిగ్రీ కళాశాలలు కృషి చేస్తానని అన్నారు . లెక్క ప్రకారం. ప్రతి 25 కిలోమీటర్లకు ఒక డిగ్రీ కళాశాల ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని కానీ 50 కిలోమీటర్ల వరకు కూడా డిగ్రీ కళాశాల లేకపోవడం విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఉన్నత విద్యపై ప్రత్యేక శ్రద్ధ చూపుతామని అన్నారు.. వెనుకబడిన ప్రాంతమైన ఆదిలాబాద్ జిల్లాలో విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని అన్నారు.

.ఉట్నూర్ లో మూతబడ్డ డిఈడి కళాశాల ను పునర్ ప్రారంభించేందుకు శాయశక్తుల కృషి చేస్తానని అన్నారు. ప్రతి గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతి యువకులకు ఇతర విద్య సంస్థల్లో ఉన్నట్టుగా 3:నెలల పాటు మధ్యాహ్నం భోజన ఏర్పాట్లు చేయించేందుకు కృషి చేస్తానని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గ్రంధాలయాలను ఆధునికరించి ఈ లైబ్రరీలుగా మారుస్తామని అన్నారు.మహిళా డిగ్రీ కళాశాలలో పని చేస్తున్న లెక్చరర్లకు ట్రెజరరీ ద్వారా జీతాలు ఇప్పించే విధంగా కృషి చేస్తానని అన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో పని చేస్తున్న టీచర్లకు హెల్త్ కార్డులతో పాటు సమాన పనికి సమాన వేతనం ఇప్పించే విధంగా కృషి చేస్తానని అన్నారు..

ప్రైవేటు డిగ్రీ పీజీ కళాశాలల యాజమాన్యం ఫీజు రియంబర్స్మెంట్ రాక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని వారికి పెండింగ్ బకాయిలను విడుదల చేయించేందుకు కృషి చేస్తానని జాబ్ క్యాలెండర్ ను అమలు చేసే విధంగా కృషి చేస్తానని అన్నారు. రాబోయే రోజుల్లో ఉద్యోగులకు నిరుద్యోగులకు పట్టభద్రులకు అండగా ఉంటానని రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.జాతీయ విద్యా దినోత్సవం సందర్భంగా . స్వాతంత్ర్య సమర యోధుడు, భారత ప్రభుత్వ తొలి విద్యాశాఖామంత్రి అయిన మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ కి ఘనంగా నివాళులు అర్పించి పలువురి ఉపాధ్యాయులను, అధ్యాపకులను సన్మానించారు.

# ఏరు దాటాక తెప్ప తగలేసినట్లుగా ఉంది..

**వార్షిక బడ్జెట్‌పై వైసీపీ ఎమ్మెల్సీ సెటైర్లు**



ఏరు దాటాక తెప్ప తగలేసినట్లుగా కూటమి బడ్జెట్ ఉందని ఎమ్మెల్సీ, వైసీపీ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు వరుదు కల్యాణి ఎద్దేవా చేశారు. ఏడు నెలల పాటు ఓటాన్ అకౌంట్ బడ్జెట్ అమలు చేసి దేశ చరిత్రలోనే ఎవరూ చేయని చెత్త రికార్డును కూటమి ప్రభుత్వం నెలకొల్పిందని విమర్శించారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద సోమవారం వరుదు కలమ్మాట్లాడుతూ.. ఎన్నో పథకాలు ఇస్తామని ప్రగల్బాలు పలికిన కూటమి ప్రభుత్వం.. ఈ బడ్జెట్‌లో దేనికీ నిధులు కేటాయించలేదని విమర్శించారు. ప్రజలను ఈ ప్రభుత్వం నిట్టనిలువుగా మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు ఏటా రూ.20 వేలు ఇస్తామన్నారని.. కానీ కేవలం రూ.5వేల కోట్ల నిధులే కేటాయించారని అన్నారు. తల్లికి వందనం పథకం కోసం కేవలం రూ.5300 కోట్లు కేటాయించారని.. ఇవి ఏ మూలకు సరిపోతాయని ప్రశ్నించారు. సగం సగం నిధులు కేటాయించి ప్రజలను మభ్యపెడుతున్నారని మండిపడ్డారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని హామీ ఇచ్చారని.. కానీ బడ్జెట్‌లో మాత్రం నిధులు కేటాయించలేదని వరుదు కల్యాణి తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ఎప్పుడు ఇస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. మహిళలకు నెలకు 1500 ఇస్తామన్న మహాశక్తి పథకానికి కూడా నిధులు కేటాయించలేదని అన్నారు. 50 లక్షల మంది నిరుద్యోగులకు నెలకు 3 వేల చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామన్నారని.. ఆ నిధులు ఎక్కడ అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రజలను కూటమి ప్రభుత్వం నమ్మించి మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలను మభ్యపెట్టి మోసం చేశారని.. ప్రజలను నిట్టనిలువుగా ముంచారని అన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని వైసీపీ పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు.

# ఈ ఏడాదిలోనే మహిళలకు ఉచిత బస్సు ..

## మంత్రి కీలక వ్యాఖ్యలు



మహిళలకు ఉచిత బస్సు పథకంపై మంత్రి పార్థసారథి కీలక ప్రకటన చేశారు. ఈ ఏడాదిలోనే ఉచిత బస్సు పథకాన్ని అమలు చేస్తామని తెలిపారు. రాష్ట్ర బడ్జెట్‌కు సంబంధించిన అంశాలపై నిర్వహించిన మీడియా సమావేశంలో పార్థసారథి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ బడ్జెట్ ప్రవేశ పెట్టిందని తెలిపారు.

గత ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడిందని.. వ్యవస్థలను ధ్వంసం చేసి పరిపాలన అస్తవ్యస్తం చేసిందని పార్థసారథి మండిపడ్డారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను వైసీపీ సర్కార్ చిన్నాభిన్నం చేసిందని విమర్శించారు. గత వైసీపీ సర్కార్ రూ. 1.35 లక్షల కోట్ల మేర బకాయిలు పెట్టి వెళ్లిపోయిందని చెప్పారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను తిరిగి గాడిన పెట్టేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిన ప్రకారం సూపర్ సిక్స్ పథకాలను కూటమి ప్రభుత్వం అమలు చేస్తోందని పార్థసారథి అన్నారు. ఇచ్చిన హామీ మేరకు అన్ని పథకాలు అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఇప్పటికే రెండు ప్రధాన హామీలను అమలు చేస్తున్నామని చెప్పారు. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే పింఛన్లను రూ.3 వేల నుంచి 4 వేలకు పెంచామని తెలిపారు. ఉచిత గ్యాస్ అమలులో భాగంగా రూ.840 కోట్ల నిధులను మంజూరు చేశామని పేర్కొన్నారు. మరో రెండు పథకాల అమలు కోసం ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించామని అన్నారు. తల్లికి వందనం పథకానికి ఈ బడ్జెట్‌లోనే నిధులు కేటాయించామనిచెప్పారు. దీపం పథకాన్ని ఇప్పటికే అమలు చేశామన్నారు.

# దేవాలయాల్లో చోరీలు.. ముగ్గురి అరెస్ట్

## రూ.40 వేల నగదు, 3 సెల్‌ఫోన్లు, బైక్ స్వాధీనం



మన్సూరాబాద్, నవంబర్ 11 : దేవాలయాల్లో చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు అంతర్రాష్ట్ర దొంగలను ఎల్బీనగర్ పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం ప్రకారం.. కర్ణాటకకు చెందిన ఉమేశ్ (23) క్యాటరింగ్ పనులు చేస్తున్నాడు. అదే రాష్ట్రానికి చెందిన కార్తీక్ (20) సెంట్రింగ్ పనులు, నితిన్‌కుమార్ అలియాస్ మిట్టు (20) షాప్ కీపర్‌గా పనిచేస్తున్నారు. ఉమేశ్, కార్తీక్, నితిన్‌కుమార్ స్నేహితులు. జల్సాలకు అలవాటు పడి తమ కోరికలను తీర్చుకునేందుకు దొంగతనాలు చేయడం మొదలుపెట్టారు. ఈ ముగ్గురు కలిసి దొంగతనాలు చేసేందుకు బైక్‌పై నగరానికి వచ్చి.. రెండు రోజుల పాటు లాడ్జీల్లో మకాం వేస్తారు. లాడ్జికి సమీపంలో ఉండే దేవాలయాల వివరాలను గూగుల్‌లో సెర్చ్ చేసి రెక్కీ నిర్వహిస్తారు. ఎంపిక చేసుకున్న దేవాలయం మూసిన అనంతరం అర్ధరాత్రి సమయంలో బైక్‌పై ఆలయం వద్దకు వెళ్లి.. లోనికి చొరబడుతారు. హుండీలను పగులగొట్టి నగదును అపహరిస్తారు.

ఈ క్రమంలో హయత్‌నగర్, తొర్రూర్ క్రాస్ రోడ్డులోని షిర్డీ సాయిబాబా ఆలయంలోకి 2024, సెప్టెంబర్ 12న చొరబడి హుండీలోని నగదును తస్కరించారు. అదేవిధంగా.. మన్సూరాబాద్, సెంట్రల్‌బ్యాంకు కాలనీలోని శ్రీ ఉమానాగలింగేశ్వర స్వామి దేవాలయంలో 2024, అక్టోబర్ 25న హుండీలోని నగదును ఎత్తుకెళ్లారు. సెంట్రల్ బ్యాంకు కాలనీలోని శ్రీ ఉమానాగలింగేశ్వర స్వామి దేవాలయం మేనేజర్ బొశెట్టి లింగయ్య ఆ మరుసటి రోజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎల్బీనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఇదిలా ఉండగా.. ఎల్బీనగర్ పోలీసులు సోమవారం ఉదయం సిరీస్ రోడ్డులోని డీవీఎం కళాశాల వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా.. ఉమేశ్, కార్తీక్, నితిన్‌కుమార్ బైక్‌పై అటువైపు వచ్చారు. పోలీసులను చూసిన ముగ్గురు బైక్‌ను వదిలేసి పారి పోయేందుకు ప్రయత్నించారు. చాకచక్యంగా వ్యవహరించిన పోలీసులు ఆ ముగ్గురిని అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా.. దేవాలయాల్లో చోరీలకు పాల్పడిన విషయం బయటపడింది. నిందితుల నుంచి రూ. 40 వేల నగదు, 3 సెల్‌ఫోన్లు, బైకును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులైన ఉమేశ్, కార్తీక్, నితిన్‌కుమార్‌ను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు

# భూటాన్‌లో 'ఆనంద నగరం'

**శారీరక, మానసిక ప్రశాంతతకు కేరాఫ్**

**పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు కూడా**

**2,500 చ.కి.మీ విస్తీర్ణంలో నిర్మాణం**



హైదరాబాద్, : స్మార్ట్ సిటీ, ఫార్మా సిటీ, సైబర్ సిటీ, హైటెక్ సిటీ.. ఇలా ఎన్నెన్నో కొంగొత్త నగరాల గురించి తరుచూ వినే ఉంటాం. అయితే, పొరుగు దేశం భూటాన్‌లో మైండ్‌ఫుల్‌నెస్ సిటీ నిర్మాణాన్ని అక్కడి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్నది. దీన్ని ఆనంద నగరంగా కూడా పిలుస్తున్నారు.

ఏమిటీ నగరం?
భూటాన్‌కు దక్షిణంగా భారత సరిహద్దుల్లో 2,500 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో అక్కడి ప్రభుత్వం మైండ్‌ఫుల్‌నెస్ సిటీ నిర్మాణాన్ని సోమవారం ప్రారంభించింది. దీన్ని 'గెలెఫు మైండ్‌ఫుల్‌నెస్ సిటీ' (జీఎంసీ)గా నామకరణం చేశారు. దేశంలోని మిగతా ప్రాంతాలతో పోలిస్తే, ఇక్కడ ప్రత్యేక నియమాలు, నిబంధనలు వర్తిస్తాయని అధికారులు పేర్కొన్నారు. ప్రత్యేక వసతులు ఉంటాయన్నారు.

ఎందుకు?
ఏ కొత్త నగర నిర్మాణమైనా ప్రజల ఆవాసాలకు, పరిశ్రమల ఏర్పాటుకు, పెట్టుబడులను ఉద్దేశించే జరుగుతుంది. అయితే, ఈ ఆనంద నగరం మాత్రం ప్రజలకు శారీరక, మానసిక ఆరోగ్యాన్ని అందించేందుకు తద్వారా సంతోషాన్ని అందించేందుకు తీసుకొస్తున్నారు. ఈ నగరంలో కాలుష్యమనేదే ఉండదు. ఎందుకంటే ఇంధనంతో నడిచే వాహనాలు ఇక్కడ అనుమతించబోరు. కర్బన ఉద్గారాలు లేని సైకిల్స్, ఎలక్ట్రిక్ వాహనాలకే అనుమతి ఉంటుంది. అంతేకాదు ఔషధ మొక్కలు, పూలవనాలు, యోగాకు ప్రత్యేక కేంద్రాలు, ఉల్లాసానికి, ఆటవిడుపుకు పార్కులు, హాల్స్, ఆరోగ్యానికి అత్యుత్తమ దవాఖానలు, శారీరక దారుఢ్యానికి వెల్‌నెస్ సెంటర్లు, ఆధ్యాత్మిక కేంద్రాలు, మనుషుల మధ్య ఆత్మీయానుబంధాలను పెంచేందుకు పబ్లిక్ కమ్యూనిటీ యాక్టివిటీ కేంద్రాలు ఇలా అన్నింటినీ ఇక్కడ ఏర్పాటు చేయనున్నారు. సంప్రదాయ వ్యవసాయం, కళాపోషణ, గ్రీన్ ఎనర్జీలో కొత్త పరిశోధనలు, హైడ్రో ఎలక్ట్రిక్ డ్యామ్, డ్రైపోర్ట్, ఎయిర్‌పోర్ట్, వ్యాపార కార్యకలాపాలకు కూడా ఇక్కడ చోటు ఉండనుంది.

నిరుద్యోగానికీ చెక్
మైండ్‌ఫుల్‌నెస్ సిటీ నిర్మాణంతో కొత్త పెట్టుబడులే కాకుండా ఇక్కడికి వచ్చే పర్యాటకులకు శారీరక, మానసిక ఆరోగ్యం కూడా లభిస్తుందని భూటాన్ ప్రభుత్వం తెలిపింది. దేశంలోని నిరుద్యోగాన్ని ఈ నగరం కొంతలో కొంత తగ్గించవచ్చని ఆశాభావం వ్యక్తం చేసింది. ఈ నగర నిర్మాణానికి కూడా పెట్టుబడుదారుల నుంచి నిధులను స్వీకరిస్తున్నట్టు ప్రభుత్వం పేర్కొంది.

# పులివెందుల పౌరుషం ఉంటే అసెంబ్లీకి రా..

**జగన్‌కు మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సవాలు**



మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్‌పై ఏపీ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి మండిపడ్డారు. నీతి నిజాయితీ ఉంటే, దమ్ముంటే అసెంబ్లీకి రావాలని సవాలు విసిరారు. రోడ్ల అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమని తెలిపారు. సోమవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద బీసీ జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎవరి తప్పులేంటో అసెంబ్లీలో చర్చిద్దామని అన్నారు. తప్పులు చేసినందుకే భయపడి.. జగన్ అసెంబ్లీకి రావడం లేదని విమర్శించారు. జగన్ అసెంబ్లీకి వస్తే మాట్లాడేందుకు మైక్ ఇస్తామని బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు. పులివెందుల పౌరుషం ఉంటే జగన్ అసెంబ్లీకి రావాలని సవాలు విసిరారు. జగన్‌కు ప్రజలే ప్రతిపక్ష హోదా ఇవ్వలేదని అన్నారు. ప్రజలే పక్కన పెట్టినా జగన్‌కు సిగ్గురావడం లేదని మండిపడ్డారు. గత ఐదేళ్ల పాలనలో వైసీపీ విధ్వంసం సృష్టించిందని అన్నారు. దీంతో పెట్టుబడిదారులు సైతం రాష్ట్రం నుంచి వెళ్లిపోయారని అన్నారు. ఇలాగే వ్యవహరిస్తే చివరకు ఒక్క సీటు కూడా ఆ పార్టీకి రాదని జోస్యం చెప్పారు. పోర్టులపై జగన్ తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు. సోషల్‌మీడియాలో అనుచిత పోస్టులు పెడితే ఊరుకోమని హెచ్చరించారు. తప్పు చేసినవారిని కచ్చితంగా శిక్షిస్తామని స్పష్టం చేశారు

# మేఘాల్లోనూ మైక్రోప్లాస్టిక్

## పర్యావరణాన్ని ప్రభావితం చేస్తుందొచ్చు శాస్త్రవేత్తల ఆందోళన



న్యూఢిల్లీ: భూమిని మొత్తం ఆక్రమించేసిన మైక్రోప్లాస్టిక్స్ మేఘాల్లోకీ చేరాయని, ఇవి పర్యావరణాన్ని సైతం ప్రభావితం చేస్తుందొచ్చని శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇందుకు సంబంధించి అమెరికాలోని పెన్సిల్వేనియా స్టేట్ యూనివర్సిటీకి చెందిన శాస్త్రవేత్తలు చేసిన ఓ అధ్యయనంలో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఆకాశంలో మైక్రోప్లాస్టిక్‌లు మంచు కేంద్రక రేణువులుగా పనిచేసి అసహజంగా మేఘాల ఏర్పాటుకు కారణమవుతున్నాయని శాస్త్రవేత్తలు గుర్తించారు. సాధారణంగా మేఘాలు ఏర్పడే పరిస్థితులు లేకపోయినా మైక్రోప్లాస్టిక్‌లు మేఘాలు ఏర్పడేలా చేస్తాయని పేర్కొన్నారు. ఈ విషయాన్ని నిర్ధారించడం కోసం పరిశోధకులు నాలుగు రకాల మైక్రోప్లాస్టిక్‌లను ప్రయోగశాలలో పరీక్షించారు. ఇందుకోసం నీటి బిందువులను చల్లబరిచి మంచుగా మార్చారు. మైక్రోప్లాస్టిక్ లేని నీటి బిందువులు మైనస్ 38 డిగ్రీల సెల్సియస్ వద్ద గడ్డ కట్టగా, 50 శాతం మైక్రో ప్లాస్టిక్‌లతో కలుషితమైన నీటి బిందువులు మైనస్ 22 డిగ్రీల సెల్సియస్ వద్దనే గడ్డ కడుతున్నట్టు తెలుసుకున్నారు. కాబట్టి మైక్రో ప్లాస్టిక్‌లు మేఘాల నిర్మాణాన్ని ప్రభావితం చేస్తున్నాయని అర్థమవుతున్నదని శాస్త్రవేత్త ప్రొఫెసర్ ఫ్రీడ్‌మన్ తెలిపారు.

# ఓటీఎస్ నిబంధనల్లో సడలింపు!

హైదరాబాద్, : ఎట్టకేలకు ఓటీఎస్ నిబంధనల్లో మార్పులు తీసుకొస్తూ జలమండలి నిర్ణయం తీసుకున్నది. ఇప్పటికే ఓటీఎస్ పథకం ద్వారా ప్రయోజనం పొందిన వినియోగదారులు భవిష్యత్‌లో సక్రమంగా నీటి బిల్లు చెల్లిస్తామని, చెల్లించని పక్షంలో రద్దు చేసిన ఓటీఎస్ రాయితీ భారం తీసుకోవాలని నిబంధన పెట్టి బకాయిదారుడి నుంచి అఫిడవిట్ తీసుకుంటున్నది.

ఈ నిబంధనపై పెద్ద ఎత్తున వ్యతిరేకత రావడం..ఓటీఎస్ అమల్లో లోపాలను వివరిస్తూ 'నమస్తే' కథనాలను ప్రచురించింది. దీంతో ఎట్టకేలకు ప్రభుత్వానికి అఫిడవిట్‌ను సమర్పించే నిబంధనను సడలించి..దాని స్థానంలో హామీపత్రం సమర్పించే వెసులుబాటు కల్పించిందని జలమండలి పేర్కొన్నది.

## విద్యాభివృద్ధికి పునాదులు వేసిన విద్యావేత్త ఆజాద్

- ఆజాద్ విగ్రహావిష్కరణ సభలో ఎంఐఎం నగర అధ్యక్షుడు గులాం అహ్మద్ హుస్సేన్




**కరీంనగర్, నవంబర్ 11(నినాదం న్యూస్) :** గడచిన 8 దశాబ్దాల క్రితం భారతదేశ విద్యా విధానంలో సాంకేతిక పరమైన, సమూల విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి, విద్యాభివృద్ధికి బలమైన పునాదులు ఏర్పరిచిన, వజ్రపు తునక, భారతరత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ అని, ఆయన చనిపోయి ఏడు దశాబ్దాలు గడిచిన ఆయన దేశానికి చేసిన సేవలు, దేశ ప్రజల గుండెల్లో చిరకాలం చిరస్మరణీయంగా గుర్తుండిపోతాయని, అందుకే నాటి కేంద్ర ప్రభుత్వం, అపర మేధావి మౌలానా ఆజాద్ జయంతిని జాతీయ విద్యా దినోత్సవంగా ప్రకటించిందని, ఎంఐఎం పార్టీ కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ అన్నారు. సోమవారం కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్ బైపాస్ ఫ్లైఓవర్ చౌరస్తాలో ఏర్పాటు,చేసిన మౌలానా అబుల్ కలాం ఆజాద్ విగ్రహాన్ని, కరీంనగర్ కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్చార్జ్ మాజీ సర్పంచ్ పురుమళ్ళ శ్రీనివాస్, మౌలానా ఆజాద్ విగ్రహావిష్కరణ కమిటీ సభ్యులతో పాటు మరికొందరు వివిధ పార్టీల నాయకులతో కలిసి గులాం అహ్మద్ హుస్సేన్, మౌలానా అబుల్ కలాం ఆజాద్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. అబుల్ కలాం విగ్రహానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా గులాం అహ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ,మౌలానా ఆజాద్ నిజమైన దేశభక్తుడని, స్వాతంత్ర పోరాటంలో గొప్ప పాత్ర పోషించారని, దేశ వ్యాప్తంగా నగరాల్లో పర్యటించి బ్రిటిష్ వారి అన్యాయాలపై అవగాహన కల్పించారన్నారు. తన కార్యాచరణ ద్వారా ప్రజలను ఏకం చేశాడని భారతదేశాన్ని స్వాతంత్రం వైపు నడిపించిన ధీశాలి అన్నారు. దేశ విభజన కోసం పట్టుబడిన మహమ్మద్ అలీజిన్నాకు వ్యతిరేకంగా, మౌలాన ఆజాద్ పాకిస్తాన్ ఏర్పాటును గట్టిగా వ్యతిరేకించారన్నారు. ప్రభుత్వం 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ముస్లిం మైనారిటీలకు ఇచ్చిన హామీలన్నింటిని తూచ, తప్పకుండా అమలు చేయాలని కోరారు. ముస్లిం మైనార్టీలకు కేటాయించే బడ్జెట్ కేవలం కాగితాలకే పరిమితం కాకూడదని, ఆచరణలో ఖర్చు చేసి చూపించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ విగ్రహావిష్కరణ కమిటీ సభ్యులు ఆఫ్జల్ షరీఫ్, సర్వర్ ఖాన్, అబ్దుల్ జమీల్, అబ్దుల్ బారి ఆదిల్, నాయకులు శానవాజ్, షైబాజ్ ఖాన్, ఇష్తియాఖ్ జమ్మూ, వాజిద్, ఎంపిటిసి పాషా, రెహన, బీరం ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## ల్యాండ్ సర్వే జూనియర్ అసిస్టెంట్ సస్పెండ్



**కోదాడ, నవంబర్ 11 (నినాదం న్యూస్) :** సూర్యాపేట జిల్లా ల్యాండ్ సర్వే కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న జూనియర్ అసిస్టెంట్ వై వెంకట్ రెడ్డి ని సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలోని కోదాడ డివిజన్ శ్రీరంగాపురం గ్రామనికి చేందిన రైతు దోంగరి వెంకటేశ్వర్లు నుండి భూమి సర్వే చేయుటకు రూ.10వేలు లంచం తీసుకున్నట్లు రైతు ఫిర్యాదు మేరకు విచారణ జరిపి సస్పెండ్ చేసినట్టు కలెక్టర్ తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.అధికారులు సిబ్బంది అవినీతికి పాల్పడితే చర్యలు తప్పవని ఈ సందర్భంగా కలెక్టర్ హెచ్చరించారు.

## విద్యా వ్యవస్థలో సాంకేతిక విప్లవాన్ని తీసుకువచ్చిన మేధావి

- అబుల్ కలాం ఆజాద్ జయంతి సభలో
- సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి




**కరీంనగర్, నవంబర్ 11(నినాదం న్యూస్) :** మౌలానా అబుల్ కలాం ఆజాద్ 136వ జయంతి సందర్భంగా నేడు డిసిసి కార్యాలయం తో పాటు నగరం లో ఎస్ఎస్ ఫంక్షన్ హాల్ లో ఘనంగా నిర్వహించారు.

మొదట జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షులు ఎండి తాజుద్దీన్ ఆధ్వర్యంలో ఏర్పాటు,చేసిన కార్యక్రమానికి సుడా చైర్మన్ నగర కాంగ్రెస్ అధ్యక్షులు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి , కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ పురుమళ్ళ శ్రీనివాస్, పిసిసి కార్యదర్శి వైద్యుల అంజన్ కుమార్, డిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి హాజరై అబుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించడం జరిగింది.

కార్యక్రమాన్ని ఉద్దేశించి కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, ఎండి తాజుద్దీన్, పురుమళ్ళ శ్రీనివాస్ మాట్లాడుతూ, పవిత్రమైన మక్కాలో జన్మించిన అబుల్ కలాం ఆజాద్ స్వాతంత్ర సంగ్రామంలో క్రియాశీలక పాత్ర పోషించడంతోపాటు మాజీ ప్రధాని నెహ్రూ క్యాబినెట్లో 11 సంవత్సరాలు దేశ విద్యా శాఖ మంత్రిగా ఎన్నో సంస్కరణలు చేపట్టి, నాడు ఈ దేశంలో కేవలం 10 శాతమే ఉన్న విద్యా వ్యవస్థలు తీర్చిదిద్ది యూనివర్సిటీలను నెలకొల్పి సాంకేతిక విప్లవాన్ని తీసుకువచ్చిన మహనీయులు, వారు దేశానికి చేసిన సేవలను గుర్తించి కాంగ్రెస్ ప్రభుత్వం భారతరత్న ఇచ్చి గౌరవించడం జరిగింది, వారి జయంతిని పురస్కరించుకొని నవంబర్ 11 న ఎడ్యుకేషన్ డేగా జరుపుకుంటున్నాం, ఆ మేధావిని స్మరించుకుంటూ కాంగ్రెస్ పార్టీ శ్రేణులమైన మేమంతా వారి ఆశయాలను కొనసాగిస్తామని తెలియజేస్తున్నామని అన్నారు.

అనంతరం నగర్ కాంగ్రెస్ మైనారిటీ సెల్ అధ్యక్షులు మహమ్మద్ అహ్మద్ అలీ ఆధ్వర్యంలో నగరంలోని ఎస్ ఎస్ ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి నియోజకవర్గ ఇన్చార్జ్ పురుమళ్ళ శ్రీనివాస్, సిటీ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్. ఏ.మోసీన్, హాజరై కేక్ కట్ చేసి మైనారిటీ సోదరులకు తినిపించడం జరిగింది. పై కార్యక్రమాల్లో నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు అబ్దుల్ రెహమాన్, బస్వరాజు శంకర్, మైనారిటీ నాయకులు నిహాళ్ అహ్మద్, లయీక్, యం. డి.ఇర్ఫాన్, యం.డి.చాంద్, షహేన్షా, ఆసిఫ్, షాకీర్, రెహానా సిరాజ్, ఆరీఫ్ ఖాన్, షబానా హనీఫ్, మెరాజ్, కుర్ర పోషయ్య, సలీ మొద్దీన్, ఖలీం , అజీమ్, నూర్ ఉద్దీన్, ముజాహిద్, ఇమామ్, బషీర్, భారీ, మీసాల మల్లేశం, ముల్కల కవిత, జ్యోతి, మహాలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులను ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న డీఈవో

- డీటీఎఫ్ ఆధ్వర్యంలో 13 న ఉపాధ్యాయుల ధర్నా
- ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి
- జిల్లా ఉపాధ్యాయ లోకానికి డిటిఎఫ్
- టీపీటీఎఫ్ సంఘాల పిలుపు




**జమ్మికుంట, నవంబర్ 11 (నినాదం న్యూస్) :** డిటిఎఫ్ టిపిటిఎఫ్ కరీంనగర్ జిల్లా శాఖలు సంయుక్తంగా టీచర్ల అక్రమ సస్పెన్షన్లు, విద్యాశాఖ అధికారి కార్యాలయంలో పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 13 న కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తామని డిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆవాల నరహరి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 5వ తేదీన సమ్మె నోటీసు ఇచ్చామని ధర్నా నోటీసు ఇచ్చిన వారిని రాతపూర్వకంగా చర్చలకు పిలిచి మాట్లాడి మినిట్స్ నమోదు చేయాల్సి ఉంటుందని కానీ అధికారులు చర్చలకు పిలువ లేదని వారు అన్నారు. ప్రొసీజర్ ను కాదని దానికి భిన్నంగా ధర్నా నోటిస్ ఇచ్చిన అనంతరం గతంలోనే విచారణ పూర్తికాబడిన అంశాలపై తిరిగి షో-కాజ్ నోటీసులు పంపుతూ వేధింపులు,కక్ష సాధింపు చర్యలకు పాల్పడడం అనేది కచ్చితంగా డిఇఓ అధికార దుర్వినియోగం కిందకే వస్తుందని. సోమవారం డీఈఓ ఆదివారం సెలవు రోజు రెండు సంఘాలు చేసిన ఆరోపణలు సత్యదూరం అంటూనే ధర్నా నోటీసులో పేర్కొన్న చాలా డిమాండ్లు పరిష్కరించామని తప్పుడు ప్రకటన విడుదల చేశారని వారు అన్నారు. డిమాండ్లలలో కేవలం ఒకటి మాత్రమే పూర్తిగా, రెండు డిమాండ్లు పాక్షికంగాను పరిష్కరించినట్లు మాకు తెలియ వచ్చింది కానీ ఏ ఒక్క కాపీ మాకు అందచేయలేదు. కేవలం ప్రకటన మాత్రమే వాట్సాప్ ద్వారా పంపారు మ. మేము పేర్కొన్న డిమాండ్లకు సంబంధించి వారి కార్యాలయానికి ప్రతిపాదనలు ఎప్పుడు సమర్పించబడినవి డిఇఓ ఎప్పుడు పరిష్కరించారనే విషయాలపై జిల్లా విద్యాధికారి కార్యాలయంలో ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా సమక్షంలో బహిర్గతపరిస్తే నిరూపించడానికి మేం సిద్ధంగా ఉన్నామని వారు పేర్కొన్నారు. కే .పద్మ అనే టీచర్ సీనియర్ /జూనియర్ సమస్య నెలల తరబడి పెండింగ్లో ఉంచి ధర్నా నోటిస్ ఇచ్చిన అనంతరం తేదీ: 07 /11 /2024న వాట్సాప్ లో పంపారు .కానీ పాత తేదీ 30 .10. 2024 ఉత్తర్వులో పేర్కొంటూ సంతకం వద్ద తేదీ వేయలేదు . కావాలనే తప్పుడుగా పాత తేదీతో (సంతకంతో పాటు తేదీ లేకుండా )ఉత్తర్వులు ఇచ్చారు .కాని పనిదినాలలో కార్యాలయంలో అందుబాటులో ఉండని డిఇఓ అదే ప్రెస్ నోట్ మాత్రం సెలవు దినమైన ఆదివారము తేదీ :10 /11/ 2024తో విడుదల చేశారని.

చాలా డిమాండ్లు పరిష్కరించామని డిఇఓ విడుదల చేసిన పత్రికా ప్రకటన సత్యదూరమని ఒక్క డిమాండ్ పూర్తిగా, రెండు డిమాండ్లు పాక్షికంగా పరిష్కరించబడి చాలా డిమాండ్లు పరిష్కరించలేదని అపరిష్కృతంగా ఉన్నాయని వారు తెలిపారు. ఈనెల 13న నిర్వహించే ధర్నా యథావిధిగా ఉంటుందని జిల్లాలోని ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని ధర్నా విజయవంతం చేయాలని టిపిటిఎఫ్, డిటిఎఫ్ జిల్లా నాయకులు సంయుక్తంగా ప్రకటన ద్వారా కోరారు. ఈ కార్యక్రమంలో ఆవాల నరహరి, తూముల తిరుపతి పోరెడ్డి దామోదర్ రెడ్డి ఆర్.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా డాక్టర్ దేవేందర్ రెడ్డి జన్మదిన వేడుకలు

**జమ్మికుంట, నవంబర్ 11 (నినాదం న్యూస్) :** జమ్మికుంట పట్టణంలోని ప్రముఖ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ దేవేందర్ రెడ్డి జన్మదిన వేడుకలను ఆయన ఆత్మీయులు సోమవారం ఘనంగా నిర్వహించారు. పట్టణానికి చెందిన వాత్సల్య పిల్లల హాస్పిటల్ డాక్టర్ దేవేందర్ రెడ్డి పుట్టినరోజు సందర్భంగా స్పందన బ్లడ్ బ్యాంక్ యాజమాన్యం ఆధ్వర్యంలో దేవేందర్ రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వైద్య వృత్తి దైవంతో సమానం అని భావించి ఎంతో మంది పిల్లలకు పునర్జీవం ప్రసాదించిన గొప్ప మానవతావాది డాక్టర్ దేవేందర్ రెడ్డి అని వారు అన్నారు. భవిష్యత్తులో మరింత మందికి అత్యుత్తమమైన వైద్య సేవలు అందించి ఇంకా ఉన్నత స్థాయికి చేరుకోవాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు వారు తెలిపారు. అనంతరం కేక్



కట్ చేసి డాక్టర్ దేవేందర్ రెడ్డి కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజిరెడ్డి రాజు యాదవ్ శ్రీధర్ అభిలాష్, ప్రవీణ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# పొలం పనులో రైతులు!

- కుటుంబ సర్వేలో ఎన్యుమరేటర్లు
- ఇంటికి తాళం వేసి వ్యవసాయ క్షేత్రాల్లోకి..
- పత్తి, వరికోత, ధాన్యం ఆరబోతలో బిజీబిజీ
- ఇబ్బందులు పడుతున్న ఎన్యుమరేటర్లు
- పూర్తి వివరాలు చెప్పేందుకు వెనుకాడుతున్న జనం
- సమగ్ర సర్వేపై అనుమానాలు ఎన్నో...?
- గతంలో చేసిన సర్వేల సంగతేంటి అంటూ ప్రజల నుండి ప్రశ్నలు

**కోదాడ, నవంబర్ 11 (నినాదం న్యూస్):** : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజల నుంచి స్పందన అంతంత మాత్రంగానే వస్తున్నది.నిన్నా మొన్నటి వరకు కులాలు, మాతృ బాషలపై పోస్టులు సోషల్ మీడియాలో వైరల్ కాగా ఈనెల శనివారం నుంచి మొదలైన ఇంటింటి సర్వేపై కొన్ని చోట్ల ప్రజలు ఆసక్తి చూపడం లేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హాయాంలో ఒక్కరోజు కుటుంబ సర్వే చేపట్టిన విషయం తెలిసిందే. మళ్లీ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కుటుంబ ఆర్థిక, విద్య, ఉద్యోగ, ఉపాధి, స్థిర ఆస్తులపై సర్వేను ప్రారంభించింది. అయితే గత ప్రభుత్వం చేసిన సర్వేతో తమకు ఏమీ లబ్ది జరుగలేదు. ఈసారి మళ్లీ మీరు చేస్తే ఏం వస్తుందనే అభిప్రాయాలను సర్వే అధికారుల ముందు జనం వెల్లబోస్తున్నారు.సూర్యాపేట జిల్లాలో అర్బన్ ప్రాం తాల్లో నివసిస్తున్న ప్రజలు కొంత అందుబాటులో ఉన్నప్పటికీ, రూరల్ ప్రాంతాల్లో ఉండే ప్రజలు పొలం పనుల్లో బిజీ బిజీగా ఉన్నారు. దీంతో ఎన్యుమరేటర్లు ఇంటికి వెళ్లిచూడగా.. ఎవరూ ఉండకపోవడంతో సర్వే చేయడానికి అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని వారు వాపోతున్నారు. సర్వేను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని కాంగ్రెస్ పార్టీ తరపున కూడా పార్టీ శ్రేణులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చి నప్పటికీ క్షేత్రస్థాయిలో అది సాధ్యం కావడం లేదు. కొన్ని మండలాల్లో ఇప్పటికీ స్టిక్కరింగ్ వేయడం పూర్తికాకపోవడంతో సర్వే ఎప్పుడు మొదలుపెట్టాలో అర్థం కాని పరిస్థితి నెలకొంది.



స్టిక్కరింగ్ ఆధారంగానే ఏ గ్రామ పంచాయతీకి ఎన్ని సర్వే రిపోర్టు పంపించాలి అనేది డిసైడ్ చేస్తారు. అది పూర్తయ్యాకే గ్రామ పంచాయతీలకు సర్వే రిపోర్టులు అందుతాయని అధికారులు వెల్లడిం చారు. 76 ప్రశ్నలతో కూడిన సుదీర్ఘ రిపోర్టులో ఎన్యుమరేటర్లు సరైన సమాధానాలు రాబట్టడం కొంత కష్ట తరంగానే కనిపిస్తున్నది. కోదాడ నియోజకవర్గ వ్యాప్తంగా మండలాలలోని వివిధ గ్రామాల్లో, మున్సిప ల్లో లోని వివిధ వార్డుల్లో సోమవారం సమగ్ర కుటుంబ సర్వే నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతీ నిధులు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆధార్ వివరాలు, కులానికి సంబంధించిన వివరాలు అన్నీ చెబుతున్నప్పటికీ, కొందరువారు పొందుతున్న సబ్సిడీల వివరా లు చెప్పడానికి జంకుతున్నారు. మరీ ముఖ్యంగా కొందరికి రేషన్ కార్డు పొందే అర్హత లేకపోయినా చాలామందికి రేషన్ కార్డులున్నా యి. అలాంటివారు రేషన్ కార్డు ఉందనే వివరాలు చెప్తే మళ్లీ రేషన్ కార్డు ఎక్కడకట్ అవుతుందేమోనని భయపడి వివరాలు గోప్యంగా ఉంచుతున్నట్లు తెలుస్తున్నది. స్థిర, చర ఆస్తుల వివరాలు, లోన్ల వివరాలు చెబితే ఎక్కడ సమస్యలు వస్తాయో అని గోప్యత వహిస్తున్నారు. ఇక రాజకీయ నాయకులు కూడా తమ రాజకీయ అనుభవం చెప్పడానికి భయపడుతున్నారు. రాజకీయ అనుభవం ఎక్కువగా ఉంది అంటే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో అవకాశం ఇస్తారో లేదో అనే భయంతో అడిగిన ప్రశ్నలకు సరైన సమాధానం చెప్పడానికి ఇబ్బంది పడుతున్నారు.

**ఎన్యుమరేటర్ల బాధలు వర్ణనాతీతం..**

అర్బన్ ప్రాంతాల్లో సర్వే కొంత వరకు కొనసాగుతున్నప్పటికీ రూరల్ ఏరియా గ్రామీణ ప్రాంతాల్లో వరి కోతలు, పత్తి ఏరడం, ఇతర పొలం పనులు ఉండడంతో రైతులు ఉదయం 9 గంటల్లోపే పంట పొలాలకు వెళ్లి, సాయంత్రం 6 గంటలకు ఇంటికి వస్తున్నారు. దీంతో ఎన్యుమరేటర్లు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వివరాలు సేకరించడానికి కుటుంబ సభ్యులు ఎవరూ లేకపోవడంతో వెనుదిరగాల్సి వస్తున్నదని అంటున్నారు. ప్రభుత్వం ఇచ్చిన టార్గెట్ పూర్తి చేయాలని ఉదయం లేచి గ్రామాలకు వెళ్తే ఎవరూ ఉండడం లేదు. ఇలా అయితే సర్వే సజావుగా సాగే పరిస్థితి లేదని, ఈ సమస్యను పరిష్కరించడం కోసం ప్రభుత్వం ఏదైనా నిర్ణయం తీసుకోవాలని అంటున్నారు. స్టిక్కరింగ్ సమయంలో కూడా కుటుంబ సభ్యులు లేకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నామని చెబుతున్నారు.


సొంతూరికి వెళ్ళాలా ... వద్దా.. ?

**క్లారిటీ ఇచ్చిన సర్కార్...**

ఎవరూ ఎటువంటి గందరగోళానికి గురికావద్దని ఆధార్ కార్డులో చిరునామా తమ సొంత ఇంటి ప్రాంతంలో ఉన్నప్పటికీ ఆ కుటుంబం ప్రస్తుతం ఎక్కడ నివసిస్తుంటే అక్కడే తమ వివరాలను నమోదు చేయించుకోవచ్చు అని పేర్కొంది. సొంతింటికీ స్వగ్రామానికి వెళితేనే కుటుంబ వివరాలు నమోదు చేస్తారనేది అపోహ మాత్రమేనని ఎవరు ఈ విషయంలో ఆందోళన చెందవద్దని రాష్ట్ర ప్రణాళిక శాఖ సూచించింది.

# మహిళలు పాలకూరను ఎక్కువగా తినాలి.. ఎందుకంటే..?

సాధారణంగా పురుషుల శరీరం కన్నా స్త్రీల శరీరంలోనే అనేక మార్పులు వస్తుంటాయి. వయస్సు మీద పడే కొద్దీ ఈ మార్పులు ఎక్కువవుతుంటాయి. కనుక వారు ఆరోగ్యం పట్ల అమితమైన శ్రద్ధ తీసుకోవాల్సి ఉంటుంది. శరీరంలో ఏర్పడే మార్పులకు తగినట్లుగా ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలి. ముఖ్యంగా స్త్రీ శరీరంలో హార్మోన్ల పరంగానే కాకుండా శారీరక పరంగా కూడా పలు మార్పులు వస్తుంటాయి. అయితే ఈ మార్పులకు అనుగుణంగా శరీరం ఆరోగ్యంగా ఉండేందుకు గాను పలు ఆహారాలను తీసుకోవాల్సి ఉంటుంది. వాటిల్లో పాలకూర ప్రథమ స్థానంలో ఉంటుందని చెప్పవచ్చు. మహిళలు పాలకూరను తరచూ తీసుకోవాలి. దీంతో అనేక లాభాలు కలుగుతాయి.



**రక్తహీనతకు..**

మహిళలకు నెలసరి సమయంలోనే కాకుండా పిల్లలకు జన్మ ఇచ్చినప్పుడు రక్తం ఎక్కువగా అవసరం అవుతుంది. తగినంత ఐరన్ లేకపోతే రక్తహీనత ఏర్పడుతుంది. అయితే పాలకూరలో ఐరన్ సమృద్ధిగా ఉంటుంది కనుక ఐరన్ లోపాన్ని అధిగమించవచ్చు. అందుకు గాను ఆయా సమయాల్లో మహిళలు పాలకూరను ఎక్కువగా తీసుకోవాలి. దీంతో శరీరం నుంచి పోయే రక్తాన్ని భర్తీ చేయవచ్చు. సాధారణంగా 100 గ్రాముల పాలకూరను తింటే 2.7 మిల్లీగ్రాముల మేర ఐరన్‌ను పొందవచ్చు. దీంతో రక్తహీనత రాకుండా చూసుకోవచ్చు.

**గర్భిణీలకు..**

గర్భంతో ఉన్న మహిళలకు ఫోలేట్ అనేక పోషక పదార్థం ఎక్కువగా అవసరం అవుతుంది. ఇది బిడ్డ ఎదుగులకు ఎంతగానో అవసరం. పుట్టుకతో పిల్లలకు లోపాలు రాకుండా ఉండేందుకు గాను ఫోలేట్ ఉండే ఆహారాలను తింటుండాలి. డాక్టర్లు సాధారణంగా గర్భిణీలకు ఫోలేట్ ఉండే ట్యాబ్లెట్లను ఇస్తారు. వాటితోపాటు పాలకూరను కూడా తరచూ ఆహారంలో భాగం చేసుకోవాలి. దీంతో 100 గ్రాముల పాలకూంను తినడం వల్ల సుమారుగా 165 మైక్రోగ్రాముల మేర ఫోలేట్ లభిస్తుంది. ఇది తల్లికి, బిడ్డకు ఇద్దరికీ మేలు చేస్తుంది. వారిని ఆరోగ్యంగా ఉంచుతుంది.

**కీళ్ల నొప్పులు తగ్గేందుకు..**

పాలకూరలో క్యాల్షియం కూడా సమృద్ధిగానే ఉంటుంది. 100 గ్రాముల పాలకూరను తింటే 99 మిల్లీగ్రాముల మేర క్యాల్షియం లభిస్తుంది. ఇది స్త్రీల ఎముకలను ఆరోగ్యంగా ఉంచుతుంది. దీంతో వారికి ఆస్టియో పోరోసిస్, ఆర్థరైటిస్ వంటి ఎముకలు సమస్యలు రాకుండా అడ్డుకోవచ్చు. అలాగే కండరాల పనితీరు మెరుగు పడుతుంది. శారీరకంగా ఉండే నొప్పులు, వాపులు కూడా తగ్గుతాయి. పాలకూరలో మెగ్నిషియం కూడా ఎక్కువగానే ఉంటుంది. 100 గ్రాముల పాలకూర ద్వారా 79 మిల్లీగ్రాముల మేర మెగ్నిషియం లభిస్తుంది. ఇది స్త్రీల కండరాల పనితీరుకు ఎంతగానో అవసరం అవుతుంది. దీంతోపాటు బ్లడ్ షుగర్ లెవల్స్ తగ్గుతాయి, బీపీ నియంత్రణలోకి వస్తుంది. ఎముకలు ఆరోగ్యంగా ఉంటాయి. పాలకూరలో విటమిన్ కె ఉంటుంది. ఇది గాయాలు అయినప్పుడు రక్తం త్వరగా గడ్డ కట్టేలా చేస్తుంది. దీంతో తీవ్ర రక్తస్రావం ముప్పు మహిళలకు తప్పుతుంది. పాలకూరలో 100 గ్రాములకు గాను 482.9 మైక్రోగ్రాముల మేర విటమిన్ కె ఉంటుంది. ఇది ఎముకలను సైతం ఆరోగ్యంగా ఉంచుతుంది. ఇలా పాలకూరతో ఎన్నో అద్భుతమైన ప్రయోజనాలు కలుగుతాయి కనుక మహిళలు తప్పకుండా దీన్ని తరచూ తీసుకోవాలి.

## ఫలించిన చర్చలు నేటి నుండి
# పత్తి కొనుగోలు ప్రారంభం

- పాత పద్ధతుల కొనసాగింపుకు నిర్ణయం...



**జమ్మికుంట నవంబర్ 11 (నినాదం న్యూస్) :** పత్తి కొనుగోళ్లపై కేంద్రం తీసుకున్న ఎల్ 1, ఎల్ 2, ఎల్ 3, నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సోమవారం తెలంగాణ రాష్ట్రంలో మిల్లర్స్ అసోసియేషన్ బందు పిలుపు పాటిస్తున్న తరుణంలో, బొంబాయి నుండి సిఎండి , హైదరాబాదు రాష్ట్ర మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులతో చర్చలు జరిపి పాత పద్ధతినే పాటించాలని మిల్లర్స్ కు రైతులకు అనుకూలంగా నిర్ణయం తీసుకోవడంతో చర్చలు సఫలమైనట్లు మిల్లర్స్ అసోసియేషన్ తెలిపింది. మంగళవారం నుండి రైతులు మార్కెట్ కు పత్తిని తీసుకురావాలని మిల్లర్స్ అసోసియేషన్ కోరారు.ఎల్1, ఎల్ 2, ఎల్ 3 అనగా ఒక మిల్లు నిండిన తర్వాత మరొక మిల్లుకు పత్తిని కొనుగోలు చేయాలని అలా జరిగినచో చివరికి ఉన్న మిల్లు లు కనుమరుగై పోతాయని, ఇంత పెట్టుబడులు పెట్టి ఇండస్ట్రీలు నడిపిస్తున్న వారు ఎల్1 ఎల్2 ఎల్3 పద్ధతి అవలంబిస్తే కరెంట్ బిల్లులు కూడా కట్టలేని పరిస్థితులు వస్తాయని, కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణంలోని మంజునాథ ఇండస్ట్రీస్ యజమాని అయిత యుగంధర్ అన్నారు. మా బాధను అర్థం చేసుకున్న ప్రభుత్వంకు సీసీఐకి మా యూనియన్ సభ్యులకు మాకు సహకరించిన రైతు సోదరులందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రేడర్ వెనిశెట్టి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా
# దొంత రమేష్ జన్మదిన వేడుకలు



**జమ్మికుంట, నవంబర్ 11 (నినాదం న్యూస్) :** జమ్మికుంట పట్టణంలో రాష్ట్ర ఎస్సీ సెల్ మాజీ జాయింట్ కన్వీనర్ రాష్ట్ర నాయకులు దొంత రమేష్ జన్మదిన వేడుకలు యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. యువజన కాంగ్రెస్ హుజురాబాద్ నియోజకవర్గ ఉపాధ్యక్షులు తేలుకుంట్ల ప్రశాంత్ మాట్లాడుతూ దొంత రమేష్ రాష్ట్ర స్థాయి నాయకుడిగా ఉండి ఎంతోమంది యువకులకు తన వంతు సహాయంగా సహాయ కార్యక్రమాలు చేస్తూ రాష్ట్ర యువతకు ఒక స్ఫూర్తిగా నిలబడి కాంగ్రెస్ పార్టీ హుజరాబాద్ నియోజకవర్గంలో తనదైన శైలిలో సేవా కార్యక్రమాలకు ముందుండి నడిపిస్తున్నటువంటి దొంత రమేష్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ అన్న కూడా యువజన కాంగ్రెస్ హుజురాబాద్ నియోజకవర్గం ఉపాధ్యక్షులు తేలుకుంట్ల ప్రశాంత్ , బొమ్మకంటి సందీప్ , కుర్రి అభిషేక్ , బొమ్మనేని అజయ్ , పంజాల అజయ్ , తోట అఖిల్, రాకేష్, సాయి తేజ తదితరులు పాల్గొన్నారు.

## మైసూర్ పప్పుతో అనేక లాభాలు..

మనకు తినేందుకు అనేక రకాల పప్పు దినుసులు అందుబాటులో ఉన్నాయి. వాటిల్లో మైసూర్ పప్పు కూడా ఒకటి. ఇవి ఎరుపు రంగులో ఉంటాయి. కందిపప్పులాగే ఉంటాయి. వీటినే మసూర్ దాల్ అని కూడా అంటారు. అయితే ఈ పప్పును కూడా చాలా మంది తరచూ తింటుంటారు. ఈ పప్పును తినడం వల్ల మనం అనేక ప్రయోజనాలను పొందవచ్చు. భారతీయులు చాలా మంది ఈ పప్పును తరచూ తింటుంటారు. ఇందులో అనేక పోషకాలు ఉంటాయి. ఇవి మనకు అనేక లాభాలను అందిస్తాయి. మనల్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. వారంలో కనీసం 2 సార్లు ఈ పప్పును తినడం వల్ల మనం అనేక లాభాలను పొందవచ్చు. అన్ని విధాలుగా ఆరోగ్యంగా ఉండవచ్చు.

## జొన్నలతో జావ తయారీ ఇలా..
# రోజూ తాగితే ఎన్నో లాభాలు..!



పూర్వకాలంలో మన పెద్దలు చాలా వరకు జొన్నలను ఆహారంగా తినేవారు. జొన్నలతో పలు రకాల వంటకాలను తయారు చేసుకుని తినేవారు. జొన్న రొట్టెలు, జొన్న సంగటి, జొన్న అన్నం, జొన్న జావను తయారు చేసి తీసుకునేవారు. అందుకనే వారు అంత ఆరోగ్యంగా ఉండేవారు. కానీ ఇప్పుడు చాలా మంది ఆరోగ్యకరమైన ఆహారం తినడం లేదు. ఫలితంగా రోగాల బారిన పడుతున్నారు. అయితే జొన్నలను ఆహారంలో భాగంగా చేసుకుంటే అనేక ప్రయోజనాలను పొందవచ్చు. జొన్నల్లో మన శరీరానికి ఉపయోగపడే అనేక పోషకాలు ఉంటాయి. ముఖ్యంగా 100 గ్రాముల జొన్నల ద్వారా మనకు సుమారుగా 329 క్యాలరీల శక్తి లభిస్తుంది.

**సమృద్ధిగా పోషకాలు..** కొవ్వులు 3.5 గ్రాములు, పిండి పదార్థాలు 72 గ్రాములు, ఫైబర్ 6.7 గ్రాములు, ప్రోటీన్లు 11 గ్రాములు లభిస్తాయి. అలాగే జొన్నల్లో క్యాల్షియం సమృద్ధిగా ఉంటుంది. ఇది ఎముకలను బలంగా మారుస్తుంది. విరిగిన ఎముకలు అతుక్కుంటున్న వారు జొన్నలతో రోజూ ఏదో ఒక వంటకాన్ని చేసి తింటే త్వరగా ఎముకలు అతుక్కుంటాయి. జొన్నల్లో ఐరన్ సమృద్ధిగా ఉంటుంది. దీని వల్ల రక్తం తయారవుతుంది. రక్తహీనత తగ్గుతుంది. జొన్నల్లో పొటాషియం కూడా ఎక్కువగానే ఉంటుంది. ఇది బీపీని నియంత్రిస్తుంది. శరీరంలో రక్త సరఫరాను మెరుగు పరుస్తుంది. దీంతో గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ రాకుండా చూసుకోవచ్చు. జొన్నల్లో థయామిన్, రైబోఫ్లేవిన్, నియాసిన్, ఫోలేట్ కూడా సమృద్ధిగానే ఉంటాయి. ఇవి రోగాల నుంచి మనల్ని రక్షిస్తాయి. జొన్నలలో రెండు రకాలు ఉంటాయి. పచ్చ జొన్నలు, తెల్ల జొన్నలు. మార్కెట్‌లో మనకు రెండు రకాల జొన్నలు అందుబాటులో ఉన్నాయి. తెల్ల జొన్నలతో చాలా మంది రొట్టెలు తయారు చేస్తారు. పచ్చ జొన్నలతో జావ, గటక, అన్నం తయారు చేస్తారు. రెండింటిలో వేటిని తీసుకున్నా మనకు ఆరోగ్యకరమైన ప్రయోజనాలు కలుగుతాయి.

**జీర్ణవ్యవస్థకు..**

జొన్నలను తినడం వల్ల జీర్ణవ్యవస్థ పనితీరు మెరుగు పడుతుంది. జీర్ణవ్యవస్థ శుభ్రంగా మారుతుంది. గ్యాస్, అసిడిటీ, మలబద్ధకం ఉండవు. వీటిని తీసుకుంటే క్యాన్సర్ పేషెంట్లకు ఎంతగానో మేలు జరుగుతుంది. క్యాన్సర్ కణాల పెరుగుదలను జొన్నల్లో ఉండే సమ్మేళనాలు అడ్డుకుంటాయి. ఇక జొన్నలతో జావను ఎలా తయారు చేయాలో ఇప్పుడు తెలుసుకుందాం.

**జొన్నలతో జావను ఇలా చేయాలి..**

జొన్నలతో జావను తయారు చేసేందుకు గాను జొన్న పిండిని అరకప్పు తీసుకోవాలి, మజ్జిగ ఒక కప్పు, ఉప్పు తగినంత తీసుకోవాలి. జొన్న పిండిలో కొద్దిగా నీళ్లు పోసుకునొ ఉండలు లేకుండా కలపాలి. వెడల్పాటి గిన్నెలో రెండు కప్పుల నీళ్లు పోసి మరిగించి తరువాత ఈ పిండి మిశ్రమాన్ని కలపాలి. తక్కువ మంట మీద 5 నిమిషాల పాటు ఉడికించాలి. సరిపడా ఉప్పు, పలుచని మజ్జిగ కలిపి తాగాలి. ఇష్టమైతే పచ్చిమిర్చి, కరివేపాకు తరుగు, అల్లం, ఉల్లిపాయ ముక్కలు కూడా వేసుకోవచ్చు. ఇలా రోజూ జొన్నల జావను తాగడం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చు.

## మొలకలు వచ్చిన ఆలుగడ్డలు తినొద్దా..
# తింటే ఏమవుతుంది..?



ఆలుగడ్డలను చాలామంది ఇష్టంగా తింటారు. ఆలుగడ్డ కూర ఎంతో రుచిగా ఉండటమే అందుకు కారణం. ఎక్కువ రోజులు నిలువ ఉంటుందన్న కారణంగా కొందరు ఆలుగడ్డలను ఎక్కువగా తెచ్చిపెట్టుకుంటారు. ఇలాంటప్పుడు తేమ కారణంగా ఆలుగడ్డలపై మొలకలు వస్తాయి. ఇలా మొలకలు వచ్చిన ఆలుగడ్డలను తింటే ఆరోగ్యానికి హానికరమని నిపుణులు చెబుతున్నారు. ఆలుగడ్డలకు మొలకలు వస్తే వాటిలో సొలానిన్ (%ంశీశ్రీఖఅఱఅవ%) అనే విషపదార్థం ఉత్పత్తి అవుతుందట. ఈ సొలానిన్ ఆరోగ్యానికి హాని చేస్తుందట.

**మొలకలు ఎందుకు వస్తాయ్..?**

ఆలుగడ్డలను సరిగా నిల్వచేయకపోవడంవల్ల, ఎక్కువ రోజులపాటు నిలువ ఉంచడంవల్ల, తేమ, తక్కువ వెలుతురు లాంటి కారణాల వల్ల వాటిపై మొలకలు వస్తాయి. ముఖ్యంగా వేడి, తేమ కలిగిన ప్రదేశాల్లో ఆలుగడ్డలను నిల్వచేస్తే మొలకలు ఇంకా త్వరగా వస్తాయి.

**సొలానిన్ అంటే ఏమిటి..?**

సొలానిన్ అనేది ఒక విషపూరితమైన పదార్థం. ఇది ఆలుగడ్డలతోపాటు కొన్ని రకాల నైట్‌షేడ్ కూరగాయలలో సహజంగా ఉత్పత్తి అవుతుంది. మొలకలు వచ్చినప్పుడు లేదా పచ్చగా మారినప్పుడు ఆలుగడ్డల్లో సొలానిన్ స్థాయిలు పెరుగుతాయి. సొలానిన్ ఎక్కువగా తీసుకుంటే.. కడుపు నొప్పి, వికారం, తలనొప్పి లాంటి సమస్యలు వస్తాయి. జీర్ణ సంబంధ సమస్యలకు కూడా ఈ సొలానిన్ కారణం అవుతుంది.

**సొలానిన్ ప్రభావాలు**

**జీర్ణ సమస్యలు :** సొలానిన్ తీసుకోవడంవల్ల అజీర్తి, కడుపు నొప్పి, వికారం లాంటి సమస్యలు కలుగుతాయి. ఈ సమస్యలు సొలానిన్ మోతాదు అధికంగా ఉంటే అధికంగా ఉంటాయి.

**నరాల సమస్యలు :** సొలానిన్ మన నరాలపై ప్రభావం చూపుతుంది. దాంతో నాడీ సంబంధ వైఫల్యాలు, నొప్పులు, మెద తిమ్మిర్లు లాంటి లక్షణాలు కనిపిస్తాయి. కొంతమంది తక్కువ పరిమాణంలో సొలానిన్ తీసుకున్నా నరాలపై ఎక్కువ ప్రభావం కనిపించే ప్రమాదం ఉంది.

**రక్త హీనత :** సొలానిన్ రక్త హీనతకు కారణం కావచ్చు. సొలానిన్ ఉన్న ఆలుగడ్డలు రక్త హీనతకు దారితీస్తాయి. రక్త హీనత కారణంగా రోగనిరోధక శక్తి తగ్గుతుంది. దాంతో వ్యాధులు వచ్చే అవకాశం అధికమవుతుంది.

**మొలకలు తీసేసి తింటే..!**

చాలామంది ఆలుగడ్డల మొలకలు తీసి కడిగితే తినొచ్చని భావిస్తారు. కానీ మొలకలు తీసేసినంత మాత్రానా ఆలుగడ్డల్లో సొలానిన్ తొలగిపోదు. ఆలుగడ్డ అంతటా సొలానిన్ పాకి ఉంటుంది. కాబట్టి మొలకలు వచ్చిన ఆలుగడ్డలను మొలకలు తీసి తిన్నా ఆరోగ్యానికి హానికం. అయితే మొలకలు ఒకటి, రెండు ఉంటే మాత్రం అంతవరకు తొలగించి తినవచ్చట.

**మొలకలు రావద్దంటే..**

ఆలుగడ్డలను చల్లని, చీకటి ప్రదేశంలో ఉంచడం మంచిది. అలాగే ఎండ లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. తేమ ఉన్న ప్రదేశంలో ఇవి వేగంగా మొలకలు వేస్తాయి. కనుక తడి తగలకుండా చూడాలి. ఎప్పుడూ నిలువ ఆలుగడ్డలు కాకుండా తాజావి తినడం ఉత్తమం.

# షుగర్ ఎంత ఉన్నా సరే.. ఈ నీళ్లను తాగితే దెబ్బకు తగ్గిపోతుంది..!





రోజూ ఉదయాన్నే పరగడుపునే కరివేపాకు నీళ్లను తాగడం వల్ల ఎన్నో ఆరోగ్యకరమైన ప్రయోజనాలను పొందవచ్చు. ఈ నీళ్లను తాగితే మనం అన్ని విధాలుగా ఆరోగ్యంగా ఉంటాం. ఈ నీళ్లలో అనేక పోషకాలు, యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఈ నీళ్లు ఔషధ గుణాలను కలిగి ఉంటాయి. అందువల్ల ఉదయం పరగడుపునే కరివేపాకు నీళ్లను తాగడం వల్ల జీర్ణక్రియ మెరుగు పడుతుంది. రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. శిరోజాలు, చర్మం ఆరోగ్యంగా ఉంటాయి. రోజూ ఉదయం కరివేపాకు నీళ్లను తాగడం వల్ల అనేక లాభాలను పొందవచ్చని ఆయుర్వేద వైద్య నిపుణులు చెబుతున్నారు.

**జీర్ణ వ్యవస్థకు..**

కరివేపాకులను నీటిలో వేసి మరిగించి ఆ నీళ్లను రోజూ ఉదయం ఒక కప్పు మోతాదులో తాగుతుండాలి. దీని వల్ల జీర్ణవ్యవస్థ పనితీరు మెరుగు పడుతుంది. జీర్ణశక్తి పెరుగుతుంది. ఈ నీళ్లను తాగడం వల్ల జీర్ణాశయ ఎంజైమ్‌లు ఉత్పత్తి సక్రమంగా ఉంటుంది. దీంతో తిన్న ఆహారం సులభంగా జీర్ణమవుతుంది. అలాగే కడుపు ఉబ్బరం, గ్యాస్ సమస్యల నుంచి ఉపశమనం పొందవచ్చు. పొట్టలో ఏర్పడే అసౌకర్యం కూడా తగ్గుతుంది. కరివేపాకుల నీళ్లను తాగడం వల్ల జీర్ణవ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది.

**బరువు తగ్గేందుకు..**

అధిక బరువు తగ్గాలని చూస్తున్నవారికి ఈ నీళ్లు వరమనే చెప్పవచ్చు. ఈ నీళ్లను తాగడం వల్ల శరీర మెటబాలిం మెరుగు పడుతుంది. దీంతో క్యాలరీలు వేగంగా ఖర్చవుతాయి. ఫలితంగా కొవ్వు కరుగుతుంది. దీంతో అధిక బరువు తగ్గుతారు. కనుక బరువు తగ్గాలని చూస్తున్నవారు ఈ నీళ్లను తప్పనిసరిగా తాగాల్సి ఉంటుంది. ఈ నీళ్లను తాగితే బరువు నియంత్రణలో ఉంటుంది. అలాగే రోజంతా ఉత్సాహంగా ఉంటారు. శక్తిస్థాయిలు పెరుగుతాయి. ఎంత పనిచేసినా అసలు అలసిపోరు.

**చర్మ సంరక్షణ..**

కరివేపాకుల్లో యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. దీంతో చర్మం కాంతి సహజసిద్ధంగా పెరుగుతుంది. చర్మం ఆరోగ్యంగా ఉంటుంది. రోజూ కరివేపాకుల నీళ్లను తాగడం వల్ల చర్మంపై ఏర్పడే వృద్ధాప్య ఛాయలు సైతం తగ్గుతాయి. దీంతో ముఖంపై ముడతలు ఉండవు. చర్మం యవ్వనంగా కనిపిస్తుంది. మొటిమలు, మచ్చలు కూడా తగ్గుతాయి. చర్మం తన సహజసిద్ధమైన నిగారింపును సొంతం చేసుకుంటుంది. చర్మ సమస్యలు ఉన్నవారు కరివేపాకుల నీళ్లను రోజూ తాగుతుంటే ఫలితం ఉంటుంది.

**షుగర్ తగ్గేందుకు..**

జుట్టు రాలే సమస్య ఎక్కువగా ఉన్నవారు రోజూ కరివేపాకుల నీళ్లను తాగుతుండాలి. దీంతో జుట్టు కుదుళ్ల నుంచి దృఢంగా పెరుగుతుంది. పొడవుగా ఉంటుంది. జుట్టు రాలడం తగ్గుతుంది. ఇన్‌ఫెక్షన్లు, దురద, చుండ్రు నుంచి సైతం ఉపశమనం లభిస్తుంది. శిరోజాలు కాంతివంతంగా మారి ప్రకాశిస్తాయి. షుగర్ లెవల్స్ అధికంగా ఉన్నవారు కరివేపాకు నీళ్లను రోజూ తాగితే ఎంతో ఫలితం ఉంటుంది. డయాబెటిస్ సమస్య నుంచి ఉపశమనం పొందవచ్చు. షుగర్‌ను తగ్గించడంలో కరివేపాకులు అద్భుతంగా పనిచేస్తాయి. డయాబెటిస్ పేషెంట్లు వీటిని ఆహారంలో భాగం చేసుకోవాలి. లేదా రోజూ కరివేపాకులతో నీళ్లను పెట్టుకుని తాగవచ్చు. ఎలా తీసుకున్నా షుగర్ లెవల్స్ కంట్రోల్ అవుతాయి. ఇలా కరవేపాకుల నీళ్లను తాగడం వల్ల అద్భుతమైన ప్రయోజనాలను పొందవచ్చని ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు. కాబట్టి వీటిని మరిచిపోకుండా రోజూ తాగండి.

# జియో రూ.895కి 336 రోజుల వ్యాలిడిటీ..

ముఖేష్ అంబానీ యొక్క జియో కంపెనీ రేట్లు పెరిగినప్పటికీ, వార్షిక ప్లాన్ (ఇయర్లీ ప్లాన్) వినియోగదారులందరికీ అపరిమిత వాయిస్ కాల్‌లు, నెలవారీ డేటా ఆఫర్‌లను రాక్-బాటమ్ ధరకు అందిస్తోంది.336 రోజుల చెల్లుబాటుతో ఈ చౌకైన వార్షిక ప్లాన్ ఏ ప్రయోజనాలను అందిస్తుంది? ఇంత తక్కువ ధరకు ఎలా దొరుకుతుంది? చేర్చబడిన పూర్తి వివరాలను మీరు ఇప్పుడు తెలుసుకోవచ్చు.ఈ ప్లాన్‌లో 4జి డేటా అందుబాటులో ఉంది. కాబట్టి, 4జి కస్టమర్లందరికీ వర్తిస్తుంది. కానీ, రీఛార్జ్ జియోఫోన్ కస్టమర్లకు మాత్రమే అందుబాటులో ఉంది. అందుకే ఈ రాక్-బాటమ్ ధర అందుబాటులో ఉంది. వాస్తవానికి, ఈ ప్లాన్ ఎయిర్‌టెల్ మరియు వోడాఫోన్ ఐడియా వంటి కంపెనీలతో పోలిస్తే 4జి ప్లాన్‌లలో చౌకైన ధరకు




అందుబాటులో ఉంది.జియో రూ 895 ప్లాన్ 336 రోజుల చెల్లుబాటు: ఈ వార్షిక ప్లాన్‌లో, అపరిమిత వాయిస్ కాల్స్, నెలవారీ డేటా మాత్రమే కాకుండా,జియో యాప్‌ల సబ్‌స్క్రిప్షన్ కూడా కంపెనీ కస్టమర్లకు మాత్రమే అందుబాటులో ఉంటుంది.ఈ ప్లాన్ రీఛార్జ్ తర్వాత 336 రోజుల వాలిడిటీని కలిగి ఉంటుంది. అంటే 28 రోజుల చొప్పున 12 నెలల పాటు ప్రయోజనాలు లభిస్తాయి. కాబట్టి, మీరు 12 నెలల్లో అపరిమిత లోకల్, రోమింగ్ వాయిస్ కాల్‌లను పొందవచ్చు. కానీ, మీరు అలాంటి డేటా ఆఫర్‌లను ఆశించలేరు.అంటే, డేటా మరియు ప్రయోజనాలు నెలవారీ ప్రాతిపదికన (నెలకు 28 రోజులు) అందుబాటులో ఉంటాయి. ఈ రోజుల్లో కస్టమర్లు 2 జిబి డేటా మరియు 50 SMS ఆఫర్‌లను పొందవచ్చు. ఈ ఆఫర్‌లను 28 రోజులలోపు పూర్తిగా వినియోగించుకుంటే, డేటా 64 కెబిబిఎస్‌లకు తగ్గించబడుతుంది. కానీ, తదుపరి 28 రోజులు ప్రారంభమైన తర్వాత, 2జిబి డేటా మరియు 50 ఎస్ఎంఎస్‌లు ప్రయోజనాలు మళ్లీ అందుబాటులో ఉంటాయి. వాయిస్ కాల్స్‌తో పాటు, ఇతర ప్రయోజనాలను నెలవారీ ప్రాతిపదికన అందించడం ద్వారా అవసరాన్ని బట్టి ఉపయోగించుకోవచ్చు. ఈ ఆఫర్ల తర్వాత, సాధారణ కంపెనీ ఆఫర్లు అందుబాటులో ఉన్నాయి. కాబట్టి, యాప్ సబ్‌స్క్రిప్షన్ అందుబాటులో ఉంది.అలాగే, eTరియు Jio క్లౌడ్ యాప్‌లకు సబ్‌స్క్రిప్షన్ కూడా అందుబాటులో ఉంది. కాబట్టి, కస్టమర్‌లు ఈ ప్లాన్‌ని మరే ఇతర కంపెనీ అందించని ధరకు పొందవచ్చు. ఇది వార్షిక చెల్లుబాటు ఖాతా ప్లాన్. అంటే 28 రోజుల పాటు రోజువారీ డేటాతో కూడిన ప్లాన్ కావాలంటే రూ. 223 అనేది మరొక ప్రీపెయిడ్ ప్లాన్.ఈ నెలవారీ ప్లాన్‌లో అపరిమిత వాయిస్ కాల్స్ ఆఫర్ కూడా అందుబాటులో ఉంది. అయితే, ప్రతిరోజూ డేటా అందుబాటులో ఉంది. కాబట్టి, 2 జిబి డేటాను ఉపయోగించవచ్చు.

# శివుని నివాసం.. మానవుడికి అంతుచిక్కని మిస్టరీ

### కైలాస పర్వతం రహస్యాలివే

వేల ఏండ్లుగా ఎన్నో రహస్యాలను తనలో ఇముడ్చుకున్న కైలాస పర్వతం మిస్టరీని ఇప్పటికీ ఎవరూ ఛేదించలేకపోయారు. స్వయంగా పార్వతీ పరమేశ్వరులే ఇక్కడ కొలువై ఉన్నారని హిందువుల ప్రగాఢ విశ్వాసం.హిమాలయ పర్వత శ్రేణుల్లో ఒక భాగంగా ఉన్న ఈ శిఖరం ఎవరెస్ట్ కన్నా 2 వేల మీటర్లు తక్కువే ఉంటుంది. కానీ ఇప్పటివరకు కైలాస పర్వతాన్ని ఏ మానవ మాత్రుడూ అధిరోహించలేకపోయాడు.సనాతన ధర్మంలో కైలాస పర్వతం చాలా పవిత్రంగా పరిగణించబడుతుంది. ఈ పర్వతంపై శివపార్వతులు గణేశుడు కార్తికేయుడితో కలిసి నివసిస్తారని నమ్ముతారు. ఇక్కడ శివుడు నిత్యం యోగ సాధనలో నిమగ్నమై ఉంటాడని అందుకే ఈ ప్రాంతంలో విచిత్రమైన వాతావరణ పరిస్థితులు ఉంటాయంటారు. కైలాస పర్వతానికి ప్రదక్షిణలు చేసేందుకు వెళ్లిన భక్తులు ఆ పర్వతం దగ్గరకు రాగానే ఓ వింత శబ్దం వెలువడిందని, అది ఓం అని వినిపిస్తుందని చెప్పారు.మరొక పురాణం ప్రకారం.. కైలాస పర్వతం శివుని నివాసం కాబట్టి. అందుచేత జీవించి ఉన్న ఏ మానవుడూ దానిపై ఎక్కలేడు. తన జీవితంలో ఎప్పుడూ పాపం చేయని వ్యక్తి మాత్రమే కైలాస పర్వతాన్ని చేరుకోగలడు ఈ కథనాలు నిజమా లేక అసలు కారణం మరేదైనా ఉందా? అనేది చాలా కాలంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న పర్వతారోహకులను కలవరపెడుతున్న రహస్యం. ఈ మిస్టరీని ఛేదించేందుకు ఎప్పటికప్పుడు ఎన్నో ప్రయత్నాలు జరుగుతున్నాయి.1999 సంవత్సరంలో, రష్యా శాస్త్రవేత్తల బృందం కైలాస పర్వత మిస్టరీని ఛేదించేందుకు ప్రయత్నించింది. ఇందుకోసం శాస్త్రవేత్తల బృందం నెల రోజుల పాటు కైలాసం దిగువన ఉండి అనేక రకాల పరిశోధనలు జరిపారు. చివరకు కైలాస శిఖరం సహజంగా ఏర్పడలేదని, అది ఒక పిరమిడ్ రూపంలో ఉండి మందపాటి మంచుతో కప్పబడి ఉందని తేల్చారు. దీనికి వారు "శివ పిరమిడ్" అని అభివర్ణించారు.8 సంవత్సరాల ఈ పరిశోధన తర్వాత, 2007 సంవత్సరంలో, ఒక రష్యన్ పర్వతారోహకుడు సెర్గీ సిస్టికోవ్ తన బృందంతో కలిసి కైలాష్ పర్వతాన్ని అధిరోహించడానికి ప్రయత్నించాడు, కానీ అతను విఫలమయ్యాడు. దిగిన తర్వాత, అతను తన తన భయంకర అనుభవాన్ని పంచుకున్నాడు.



### అవయవాలు పనిచేయవు..

సెర్గీ సిస్టికోవ్ మాట్లాడుతూ.. 'కొంత ఎత్తుకు చేరుకున్న తర్వాత, నాతో సహా నా మొత్తం జట్టుకు తీవ్రమైన నొప్పితో తల పగిలిపోతున్నట్లు అనిపించింది. దవడ కండరాలు బిగుసుకుపోయాయి. నాలుక లోపలే స్తంభించిపోయాయి. మాట్లాడాలనుకున్నా కానీ మా గొంతు నుంచి శబ్దం బయటకు రాలేదు. అప్పుడు మా కాళ్లు కూడా అచేతనంగా మారిపోయాయి. ఏదో అదృశ్య శక్తి మా అవయవాలన్ని పనిచేయకుండా ఆపినట్టు మాకు అనిపించింది. వెంటనే దిగమని ఒకరికొకరు సంకేతాలు ఇచ్చుకున్నాం. మేము కిందకు రావడం ప్రారంభించినప్పుడు, మా అవయవాలన్నీ సాధారణ స్థితికి వచ్చాయి. దిగిన తర్వాత మాకు ఉపశమనం లభించింది' అని తెలిపాడు.బ్రిటీష్ పర్వతారోహకుడు కల్నల్ విల్సన్ కూడా కైలాస పర్వతాన్ని అధిరోహించడానికి ప్రయత్నించాడు, కానీ అతనికి కూడా అది సాధ్యపడలేదు. విల్సన్ తన అనుభవాన్ని వివరిస్తూ, 'పర్వతంపై దట్టమైన మంచు పొర ఉంది. పైకి ఎక్కడానికి ముందుకు చూడగానే వెంటనే మంచు కురుస్తోంది. దీని తరువాత, మార్గం కనిపిస్తుంది. ఈ హిమపాతం చాలా సేపు కొనసాగింది దీంతో నేను క్రిందికి దిగవలసి వచ్చింది. చాలా రోజుల పాటు ఇదే తంతు. ఏదో శక్తి మమ్మల్ని ముందుకు వెళ్లకుండా ఆపుతున్నట్లు అనిపించింది. చివరికి నా ప్రయత్నాన్ని ఆపేసి తిరిగి వెళ్లాల్సి వచ్చింది' అని తెలిపాడు.

### ఎక్కితే ముసలివాళ్లు అవుతారు..

దీని తరువాత కైలాస పర్వతం రహస్యాలను ఛేదించడానికి చైనా చాలా మంది పర్వతారోహకులను పంపింది. కానీ ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందువులు, బౌద్ధులు, జైనులు దీనిని ఎంతగా వ్యతిరేకించారు. చైనా కమ్యూనిస్ట్ ప్రభుత్వం వెనక్కి తగ్గవలసి వచ్చింది. నాటి నుంచి నేటి వరకు ఈ పర్వతాన్ని అధిరోహించే ధైర్యం ఎవరూ చేయలేదు.ఎవరైతే ఈ పర్వతాన్ని అధిరోహించాలని ప్రయత్నిస్తారో, వారి తలపై వెంట్రుకలు, గోర్లు వేగంగా పెరుగుతాయని చెప్పారు. వయసు వేగంగా రావడం మొదలవుతుంది. ముఖంలో వృద్ధాప్యం కనిపించడం ప్రారంభమవుతుంది. ముందుకు వెళ్లడానికి ప్రయత్నించే ఏ వ్యక్తి అయినా భ్రాంతికి గురవుతాడు. అతను ముందుకు వెళ్ళే మార్గాన్ని చూడలేడు. అతని అవయవాలు ఒక్కొక్కటిగా పనిచేయడం మానేస్తాయి. ఎక్కే వ్యక్తికి అకస్మాత్తుగా గుండె వేగంలో మార్పు వస్తుంది. ఈ పర్వతం చుట్టూ ఉన్న నిలువు రాళ్లు, మంచుకొండలతో ఏర్పడింది, దీని కారణంగా పైకి ఎక్కడానికి మార్గం కనిపించదు. ఈ పర్వతం వాలు 65 డిగ్రీల కంటే ఎక్కువగా ఉంటుంది, ఈ నిర్మాణం వల్ల పైకి ఎక్కడం అసాధ్యం అవుతుంది.

# డోలో 650: మీరు ప్రతి చిన్న వ్యాధికి డోలో 650 మాత్ర వేసుకున్నారా!?




కరోనా మహమ్మారి సమయంలో మునుపెన్నడూ చూడని విధంగా డోలో 650 పిల్ అమ్మకాలు రెట్టింపు అయ్యాయి.. మహమ్మారి ప్రారంభమైన మార్చి 2020 నుండి, డోలో 650 ఒక్కటే 1 నుండి 5.7 బిలియన్ రూపాయలను ఆర్జించింది.పారాసిటమాల్ మాత్రల జాబితాలో అగ్రస్థానంలో ఉన్న డోలో 650ని భారతీయులు పెద్దఎత్తున కొనుగోలు చేశారు అయితే ఒక విషయం ఏమిటంటే డోలో 650 మాత్రలు ఎంత ఎక్కువ తీసుకుంటే అంతగా తెలియక అనేక రోగాలను ఆహ్వానిస్తున్నారు.డోలో 650 టాబ్లెట్ నొప్పిని తగ్గించడానికి మరియు జ్వరాన్ని తగ్గించడానికి ఉపయోగించే ఔషధం. ఇది తలనొప్పి, శరీర నొప్పి, పంటి నొప్పి మరియు సాధారణ జలుబు వంటి ఇతర సమస్యలకు చికిత్స చేయడానికి ఉపయోగిస్తారు. నొప్పి మరియు జ్వరం కలిగించే కొన్ని రసాయనాల విడుదలను నిరోధించడం ద్వారా ఇది పనిచేస్తుంది.డోలో 650 మాత్రను అదే లేదా ఇతర మందులతో తీసుకోవాలని వైద్యులు సలహా ఇస్తున్నారు. అయితే ఈ మాత్రలు క్రమం తప్పకుండా వేసుకోవాలి. ఈ మాత్రను భోజనం తర్వాత తీసుకోవాలి. లేదంటే పొత్తికడుపు సమస్యలు కనిపించవచ్చు.ఈ ఔషధాన్ని సరిగ్గా వాడితే దుష్ప్రభావాలు తక్కువగా ఉంటాయి. ఈ ఔషధం తీసుకోవడం వల్ల కొంతమందిలో కడుపు నొప్పి, వికారం మరియు వాంతులు సంభవించవచ్చు. ఈ లక్షణాలు కనిపిస్తే, మీరు ఆలస్యం చేయకుండా వైద్యుడిని సంప్రదించాలి. ఈ పిల్ అన్ని వయసుల వారికి సిఫార్సు చేయబడదు. మీకు కిడ్నీ సమస్యలు ఉంటే లేదా బ్లడ్ థిన్నర్స్ వాడుతున్నట్లయితే, డోలో 650 టాబ్లెట్ తీసుకునే ముందు మీ వైద్యుడికి చెప్పండి.డోలో 650 టాబ్లెట్ అనేది నొప్పిని తగ్గించడానికి మరియు చికిత్స చేయడానికి ఉపయోగించే ఒక సాధారణ నొప్పి నివారిణి. ఈ టాబ్లెట్ మెదడులో నొప్పి మరియు జ్వరం కలిగించే కొన్ని రసాయనాలను అడ్డుకుంటుంది. తలనొప్పి, మైగ్రేన్, నరాల నొప్పి, పంటి నొప్పి, గొంతు నొప్పి, బహిష్టు నొప్పి, కీళ్ల నొప్పులు మరియు కండరాల నొప్పి నుండి ఉపశమనం పొందడంలో ఇది ప్రభావవంతంగా ఉంటుంది.అధిక మొత్తంలో లేదా ఎక్కువ కాలం పాటు తినవద్దు. ఎందుకంటే అది ప్రమాదకరం. సాధారణంగా, మీరు తక్కువ మోతాదు టాబ్లెట్ తీసుకోవాలి, ఇది తక్కువ వ్యవధిలో ప్రభావవంతంగా ఉంటుంది. ఇది గర్భధారణ సమయంలో లేదా చనుబాలివ్వడం సమయంలో నొప్పి నుండి ఉపశమనం పొందేందుకు ఉపయోగిస్తారు. ఈ ఔషధం వల్ల ఎక్కువ దుష్ప్రభావాల కోసం వైద్యుడిని సంప్రదించాలి, క్రమం తప్పకుండా మందులు తీసుకుంటే దుష్ప్రభావాలు తక్కువగా ఉంటాయి. దుష్ప్రభావాలు కొనసాగితే లేదా లక్షణాలు తీవ్రమైతే, మీ వైద్యుడిని సంప్రదించండి ఈ ఔషధం పెద్ద మొత్తంలో తల్లి పాలలోకి ప్రవేశించదని మరియు శిశువుకు హాని కలిగించదని అధ్యయనాలు చెబుతున్నాయి. డోలో 650 టాబ్లెట్ తీసుకునే ముందు వైద్యుని సలహా తీసుకోవాలి. మూత్రపిండాల రోగులు డోలో 650 టాబ్లెట్‌ను జాగ్రత్తగా వాడాలి.

## ఈ మొక్క చాలా పవర్ఫుల్..

ఈ మొక్కను గరుడ ముక్కు మొక్క అంటారు. అరె భలే వింతగా ఉంది కదా. ఇది మాత్రమే కాదండోయ్ ఈ మొక్కకు తేలు కొండి మొక్క అనే మరో పేరు కూడా ఉంది. మార్టీలియా నోవా ఈ మొక్క శాస్త్రీయ నామం.అయితే ఇది ఎక్కువగా గ్రామాల్లో కనిపిస్తుంది. చాలా మందికి ఈ మొక్క గురించి, దాని ప్రయోజనాల గురించి తెలియదు. చాలా మంది పిచ్చి మొక్క అనుకుంటారు. కాలువల ప్రాంతాల్లో ఎక్కువగా వృద్ధి చెందుతుంది. దీని ప్రయోజనాలు తెలిసిన వారు పురాతన కాలం నుంచి వినియోగిస్తున్నారు.శరీరానికి చాలా విధాలుగా ఈ మొక్కను నియోగిస్తారు. క్షయ వ్యాధికి కూడా చాలా ఉపయోగపడుతుంది.వీటి ఆకుల రసాన్ని మెడ మీద ప్రతి రోజు పోయడం వల్ల ఔషధంగా ఉపయోగపడుతుందట. గొంతు నొప్పితో బాధపడేవారు ఈ ఆకుల రసాన్ని నోట్లో పోసుకుని పుకిలించి ఉమ్మాలి. ఇలా చేస్తే గొంతు నొప్పికి ఉపశమనం లభిస్తుంది. జాయింట్ పెన్స్, ఒళ్లు నొప్పులు, తలనొప్పి వంటి సమస్యలకు కూడా చెక్ పెడుతుంది ఈ మొక్క.



### తమ్ముడు మోసం చేశాడని..

# పిల్లలతో సహా చెరువులో దూకి అన్న ఆత్మహత్య

-సిద్దిపేట అర్బన్ నినదం న్యూస్ : సిద్దిపేటలో దారుణ సంఘటన చోటుచేసుకుంది. తన తండ్రి మరణం తర్వాత అన్నీ తానై రెక్కలు ముక్కలు చేసుకొని కష్టపడి తమ్ముడిని చదివించాడు. తీరా తమ్ముడికి ప్రభుత్వ ఉద్యోగం రాగానే తనను దూరం పెట్టడంతో పాటు, అతనికి తాను అప్పుగా ఇచ్చిన డబ్బులను ఇవ్వకపోగా, వాటిని అడిగేందుకు వెళ్లిన తనపై చెప్పుతో కొట్టి, తనతో పాటు తన కొడుకును గెంటివేశాడు. ఈ అవమానాన్ని తట్టుకోలేక.. మనస్తాపంతో తన ఇద్దరు పిల్లలతో సహా చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన సిద్దిపేట టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చింతలచెరువులో ఆదివారం జరిగింది. సిద్దిపేట ఏసీపీ మధు, టూ టౌన్ సీఐ ఉపేందర్ తెలిపిన వివరాలు



ప్రకారం.. సిద్దిపేట పట్టణంలోని నెహ్రూ పార్క్ వాసవీ కాలనీకి చెందిన తేలు సత్యం (48) సిద్దిపేట పట్టణంలో ప్రింటింగ్ ప్రెస్ నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కాగా, సత్యంకు కొద్ది రోజుల క్రితం అనారోగ్య సమస్యలు రావడంతో పాటు, హార్ట్ సర్జరీ జరిగి రూ.9 లక్షల వరకు అప్పు అయింది. దాంతో తన తమ్ముడు అయిన శ్రీనివాస్ను తనకు ఇవ్వాల్సిన రూ.5.50 లక్షలు ఇవ్వాలని అడగ దానికి కొడుకుతో కలిసి అతని ఇంటికి వెళ్లాడు. డబ్బులు అడిగిన సత్యంను శ్రీనివాస్.. బూతు మాటలు తిట్టి చెప్పుతో కొట్టి, సత్యంని, అతని కొడుకును ఇంటి నుంచి వెళ్లగొట్టాడు. దాంతో తీవ్ర మనస్తాపానికి గురైన సత్యం శనివారం రాత్రి.. తన భార్య శిరీషకు చెప్పకుండా పిల్లలు అద్వేష్ నందా (08), త్రివన్న హాసిని(06)ని తీసుకొని ఇంట్లో నుంచి వెళ్లి చింతల చెరువుకు చేరుకొని అక్కడ సెల్ఫీ వీడియో తీసుకొని తన చావుకు కారణం తన తమ్ముడు శ్రీనివాస్ అని సూసైడ్ నోట్ సైతం రాసి పిల్లల్ని చెరువులోకి తోసి తానూ చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని భార్య శిరీష ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# 'నా కూతురు అంత అందంగా ఉండదు'

ప్రపంచంలో చాలా వింతలు ఉన్నాయి, మీరు ఒకదాన్ని కనుగొనడానికి బయలుదేరితే, మీకు ఆటోమేటిక్‌గా 4-5 వింత సంఘటనలు కనిపిస్తాయి. ఇంతకుముందు బహిరంగంగా చర్చించని విషయాలు ఇప్పుడు సర్వసాధారణంగా మారాయి.ఉదాహరణకు, ఇంతకు ముందు ఎవరూ డిఎన్ఏ పరీక్ష వంటి వాటి గురించి ఆలోచించలేదు, కానీ నేడు అది సాధారణ విషయంగా మారింది. దీనికి కొన్ని ప్రయోజనాలు ఉన్నాయి మరియు అనేక నష్టాలు కూడా ఉన్నాయి.వియత్నాంలో నివసిస్తున్న ఓ వ్యక్తి తన కూతురు వయసుతో పాటు చాలా అందంగా మారడం చూసి డీఎన్ఏ పరీక్ష చేయించుకున్నాడు. ఆమె తన కూతురు కాదనే అనుమానం ఆ వ్యక్తికి వచ్చింది. తర్వాత ఏంటి, డీఎన్ఏ టెస్ట్ చేసి రిజల్ట్ రావడంతో తల్లిదండ్రులిద్దరూ కంగుతిన్నారు.కూతురు చాలా అందంగా ఉండడంతో తండ్రికి అనుమానం వచ్చింది సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్ నివేదిక ప్రకారం, ఒక వ్యక్తి, తన టీనేజ్ కుమార్తె అందాన్ని చూసి, ఆమె తన కుమార్తె కాదని అనుమానించాడు. ఆ అమ్మాయి చిన్నప్పటి నుంచి చాలా అందంగా ఉండేది..కానీ ఎదిగడం మొదలుపెట్టాక తన తండ్రి ఎవరో అనే అనుమానం తండ్రికి మరింత బలపడింది. చివరగా ఓ రోజు తన భార్యతో దీని గురించి మాట్లాడి డీఎన్ఏ టెస్ట్ చేయించమని అడిగాడు. కోపోద్రిక్తుడైన భార్య ఆ తర్వాత కూతురిని వేరే ఊరికి తీసుకెళ్లింది, ఒకరోజు స్కూల్ మారుతున్నప్పుడు ఆ అమ్మాయి కొత్త స్కూల్లో ఒక అమ్మాయితో స్నేహం చేసింది. తన పుట్టినరోజు కూడా అదే రోజు. ఆమె తన కొత్త స్నేహితురాలి పుట్టినరోజు పార్టీకి ఆహ్వానించినప్పుడు, ఆమె తల్లి ముఖం సరిగ్గా తన స్నేహితురాలిని పోలి ఉంటుంది. దీని తర్వాత డీఎన్ఏ పరీక్ష చేయగా.. ఆమె తన కూతురే నని, తానే ఆస్పత్రిలో మారిందని తేలింది. దీని తరువాత, రెండు కుటుంబాలు తమ అనుబంధా న్ని పెంచుకున్నాయి, ఎందుకంటే వారి కుమార్తెలు పెరిగిన తర్వాత ఎక్కడ నివసించాలో నిర్ణయించుకుంటారు. దీని తర్వాత ఆసుపత్రిపై చర్యలు తీసుకున్నారా లేదా అనేది చెప్పలేదు.

# పాన్ కార్డ్ వాడేవారికి కేంద్రం నుంచి వణుకు పుట్టించే న్యూస్!

### - డిసెంబర్ 31 తరువాత చుక్కలే!




ప్రస్తుతం పాన్ కార్డు వాడకం ప్రతి ఒక్క ఇండియన్ సిటిజన్ కి చాలా ఇంపార్టెంట్ గా మారింది. బ్యాంక్ అకౌంట్ మెంటేన్ చేసే ప్రతీ ఒక్కరికీ కూడా పాన్ కార్డ్ ఉండాల్సిందే.కాబట్టి పాన్ కార్డ్ వాడే విషయంలో కచ్చితంగా జాగ్రత్తగా ఉండాలి. మన డబ్బు సేఫ్ గా ఉండాలంటే పాన్ కార్డ్ కచ్చితంగా సేఫ్ గా ఉండాలి. అందుకే పాన్ కార్డు ఉపయోగిస్తున్న అందరికీ కూడా కేంద్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు జాగ్రత్తలు చెబుతూనే ఉంటుంది. ఇక తాజాగా కేంద్రం మరో కీలక ప్రకటన చేసింది. ఇది కచ్చితంగా పాన్ కార్డ్ వాడుతున్న వారిని వణికించే న్యూస్ డిసెంబర్ 31వ తేదీ తరువాత మన పాన్ కార్డ్ లు క్యాన్సిల్ అవుతాయి. ఆ తరువాత మనం ఆర్థికంగా చాలా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుంది. అవును డిసెంబర్ 31 లోపు మనం ఓ పని చేయకపోతే.. పాన్ కార్డులు డీ యాక్టివేట్ అవుతాయి. ఇంతకీ మన పాన్ కార్డులు ఎందుకు రద్దవుతాయి? మనం ఫేస్ చేసే ఇబ్బందులు ఏంటి? అలా కాకుండా మనం చేయాల్సిన పని ఏంటి? అసలు పాన్ కార్డ్ వాడే వారికి కేంద్రం ఏం చెబుతుంది? పూర్తి వివరాలు ఇప్పుడు మనం తెలుసుకునే ప్రయత్నం చేద్దాం.పాన్‌కార్డును ఆధార్ కార్డుతో కచ్చితంగా లింక్ చేయాలని ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం ఎన్నో వందల సార్లు హెచ్చరించింది. అయినా కూడా చాలా మంది ఆ పని చేయట్లేదు. దేశంలో రోజుకు ఎన్నో రకాల ఆర్థిక మోసాలు జరుగుతూ ఉన్నాయి. ఏమాత్రం తగ్గడం లేదు. వాటిని అరికట్టడానికి ప్రధాన దారి ఆధార్ కార్డుతో పాన్ కార్డ్ లింక్ చేయడం. దేశంలో పెరిగిపోతున్న ఆర్థిక మోశాలను అరికట్టడమే లక్ష్యంగా కేంద్రం ఈ నిర్ణయాన్ని తీసుకుంది. అయితే గడువు కూడా ముగిసింది. అందుకే ప్రస్తుతం ఎవరైనా ఆధార్,పాన్ లింక్ చేసుకోకపోతే జరిమానాతో లింక్ చేసుకునే అవకాశం మాత్రమే ఉంది.వచ్చే డిసెంబర్ 31వ తేదీలోపు పాన్ కార్డులను ఆధార్ కార్డులతో లింక్ చేయకపోతే తర్వాత డీయాక్టివేట్ అవుతాయి. ఆ తర్వాత కొత్త పాన్ కార్డ్ తీసుకోవడం తప్ప మరో అవకాశం ఉండదని కేంద్రం స్పష్టం చేసింది. అలాగే పలు సమస్యలు ఎదుర్కోక తప్పదని అధికారులు హెచ్చరిస్తున్నారు.పలు ఫిన్ టెక్ సంస్థలు వినియోగదారుల అనుమతి లేకుండానే కస్టమర్ పాన్ కార్డు సమాచారాన్ని ఇష్టం వచ్చినట్లు వాడుకుంటున్నాయి. అందువల్ల కూడా ఆర్థిక మోసాల కేసులు పెరిగిపోతున్నాయి. అందుకే కేంద్రం ఈ నిర్ణయం తీసుకున్నది. వ్యక్తిగత సమాచారం దుర్వినియోగం కావడంతో చాలా మంది ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. అందుకే డిసెంబర్ 31లోపు పాన్ కార్డు, ఆధార్ లింక్ చేయకపోతే పాన్ కార్డ్ డీయాక్టివేట్ అవుతుందని అధికారులు చెబుతున్నారు. ఆ తరువాత ఎలాంటి డిజిటల్ పేమెంట్స్ జరగవు. అంతేగాక పాన్ కార్డును మళ్లీ యాక్టివేట్ చేయడం కూడా కష్టమవుతుందని అంటున్నారు. కాబట్టి కచ్చితంగా డిసెంబర్ 31 లోపు ఆధార్ కార్డ్ తో పాన్ కార్డ్ లింక్ చేయండి. జాగ్రత్తగా ఉండండి.

## కలెక్టర్‌ను కలిసిన టిఎస్జేయూ జిల్లా కమిటీ...

ములుగు ప్రతినిధి,(నినాదం న్యూస్): తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్ యూనియన్ జిల్లా కమిటీ సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ దివాకర టిఎస్ ను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్క అందించి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా టిఎస్జేయు రాష్ట్ర కమిటీ నుండి వచ్చిన ములుగు జిల్లా కమిటీ నియామక పత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. అనంతరం నూతనంగా ఎన్నికైన ములుగు జిల్లా కమిటీకి కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జర్నలిస్టులు సమాజ శ్రేయస్సుకు తోడ్పడాలని,వాస్తవిక వార్తలను వెలికితీయాలని, జర్నలిస్టులకు ప్రభుత్వం నుండి రావాల్సిన సంక్షేమ పథకాలను అందిస్తానని ఆయన అన్నారు. అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ సి హెచ్ మహేందర్ జి, డిపిఆర్ఓ రఫిక్ లను మర్యాద పూర్వకంగా వారు కలిశారు. ఈ కార్యక్రమంలో టీ ఎస్ జే యు ములుగు జిల్లా గౌరవాధ్యక్షుడు పడమటింటి నగేష్, అధ్యక్షుడు చల్లగురుగుల రాజు, ప్రధాన కార్యదర్శి సంగ రంజిత్ కుమార్, ఉపాధ్యక్షుడు కూనూరు మహేందర్,జాయింట్ సెక్రెటరీ తడక హరీష్, కోశాధికారి పొన్నాల స్వామి, ఆర్గనైజింగ్ సెక్రటరీ కంచర్ల రాజు, ఈసీ మెంబర్ కప్పంపల్లి అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని మహిళ మృతి

చింతపల్లి, నవంబర్ 11 (నినాదం న్యూస్) : మండలంలోని రాజ్యా నాయక్ తండ వద్ద హైదరాబాదు నాగార్జునసాగర్ హైవేపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని ఒక మహిళ మృతి చెందినట్లు ఎస్సై బీమనమోని యాదయ్య తెలిపారు. గుర్తుతెలియని వాహనం గుర్తు తెలియని మహిళను ఢీకొనడంతో మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. మృతి చెందిన మహిళ శరీరం పూర్తిగా ఛిద్ర మైనట్లు ఎస్ఐ తెలిపారు .మృతురాలి వయసు సుమారు 45 నుంచి 50 సంవత్సరాల వరకు ఉంటుందని ఆయన చెప్పారు.నసర్లపల్లి పంచాయతీ కార్యదర్శి బైరెడ్డి మల్లికార్జున్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. మృతురాలి వివరాలు తెలిసిన యెడల, చింతపల్లి పోలీసు వారిని సంప్రదించాలని ఆయన సూచించారు.వివరాలను ఈ క్రింది ఫోన్ నంబర్ లకు 8712670230 , 8712670156 ఫోన్ చేయాలని ఆయన చెప్పారు.

## విద్యార్థులకు అన్నదానం



చౌటుప్పల్, నవంబరు 11 (నినాదం న్యూస్): చౌటుప్పల్ మండలం పీపల్ పహడ్ గ్రామంలో జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలలో సుమారుగా 300 విద్యార్థులకు చైత్ర రియల్ ఎస్టేట్ ఫౌండేషన్ చైర్మన్ ఎల్లపల్లి లక్ష్ జన్మదినం సందర్భంగా విద్యార్థులకు అన్నదానం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తన సొంత ఊరులో ఇదే స్కూల్లో నేను చదివినందుకు తన పుట్టినరోజు చేసుకునందుకు నాకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. చైత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో మరెన్నో కార్యక్రమాలు నిర్వహిస్తుందని తెలిపారు. ఈకార్యక్రమానికి సహకరించిన అందరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో దోసపాటి అశోక్ గౌడ్, పులనగారి అశ్విన్ కుమార్ గౌడ్,తాళ్ళ రమేష్ గౌడ్,రోషనగారి సందీప్ గౌడ్,ముప్పిడి శివకుమార్, మిద్దెల లింగస్వామి,పులనగారి భాను,నల్లెంకి సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## గజ్జి కుక్కల్లా మొరుగుతున్న కేటీఆర్, హరీశ్‌రావు

### -దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి

మహబూబ్‌నగర్ : పొద్దున లేస్తే బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్‌రావులు గజ్జికుక్కల్లా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ప్రభుత్వంపై పడి మొరుగుతున్నారని డీసీసీ అధ్యక్షులు, దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు.విచక్షణ కోల్పోయి ఇష్టానుసారంగా ముఖ్యమంత్రిపై అనుచిత వ్యాక్యలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వం మంచి పనులు చేసినా విమర్శించడమే పనిగా పెట్టుకున్నారని దుయ్యబట్టారు. వారి మానసిక పరిస్థితి బాగోలేదని, ఇదివరకే తాను వారికి వైద్య పరీక్షలు నిర్వహించి ట్రీట్‌మెంట్ చేయించాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేసినట్లు ఎద్దేవా చేశారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

# ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి సహకరిస్తా






- విద్యతోనే సర్వతోముఖాభివృద్ధి
- విద్యను కష్టంగా కాకుండా ఇష్టంగా చదవాలి.
- విద్యా వ్యవస్థను మెరుగుపరచడానికి ఎల్లవేళల కృషి చేస్తా
-కిసాన్ పరివార్ సంస్థ సీఈఓ పద్మజా కుమారి చారిట్రబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ వివేక్

**డోర్నకల్ / దంతాలపల్లి నవంబర్ 11(నినాదం న్యూస్ ):** ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఎల్లవేళల కృషి చేస్తానని కిసాన్ పరివార్ సంస్థ సీఈఓ పద్మజా కుమారి చారిట్రబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ వివేక్ అన్నారు.మహబూబాద్ జిల్లా దంతాలపల్లి మండలంలోని ప్రభుత్వ సెకండరీ పాఠశాలలో ఉపాధ్యాయుల కోరిక మేరకు చారిట్రబుల్ ట్రస్టును సంప్రదించగానే పాఠశాలకు ఫ్యాన్,లైట్స్,స్పోర్ట్స్ టి షర్ట్ అందజేస్తానని హామీ ఇచ్చి తక్షణమే పాఠశాలలో నల్లాల రిపేర్ కోసం 35వేల రూపాయల చెక్కును ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. అలాగే పెరుగుతున్న పోటీ ప్రపంచాన్ని ఎదురుకోవడానికి విద్యార్థులకు కంప్యూటర్ నాలెడ్జ్ కూడా ఎంతో అవసరం కావున ఫుల్ ఎక్విప్మెంట్తో 10 కంప్యూటర్లను త్వరగా అందజేస్తానని కూడా హామీ కల్పించారు.ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు,విద్యార్థులు ఎంతో సంతోషించారు.విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ చదువును కష్టంగా కాకుండా ఇష్టపడి చదివితే బంగారు భవిష్యత్తును నిర్మించుకోవచ్చు అన్నారు.చదివిన పాఠశాలకు కన్న తల్లిదండ్రులకు మంచి పేరు సంపాదించాలనిఅన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## 265లీటర్ల మద్యం ధ్వంసం చేసిన పోలీసులు



**చౌటుప్పల్, నవంబర్ 11 (నినాదం న్యూస్):** చౌటుప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒక సంవత్సరంలో 35 కేసులకు సంబంధించి ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యం లో సీజ్ చేసిన 160 లీటర్ల బీర్లు, 70 లీటర్ల లిక్కర్ మొత్తం 230 లీటర్ల మద్యాన్ని ధ్వంసం చేశారు. మద్యాన్ని ఇంకుడు గుంతలో అధికారులు పారబోశారు. మద్యం విలువ సుమారుగా లక్ష అరవై వేల రూపాయలు ఉంటుందని, ఎవరైనా అక్రమంగా మద్యం అమ్మితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ ఎస్.సైదులు, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సిఐ శంకర్ , చౌటుప్పల్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ జి. మన్మధకుమార్, ఎస్సై కనకటి యాదగిరి, సిబ్బంది పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి

### కిసాన్ పరివార్ సంస్థ సీఈవో డాక్టర్ వివేక్



**డోర్నకల్ / దంతాలపల్లి నవంబర్ 11(నినాదం న్యూస్ ):** దేశాన్ని ఒకే తాటిపై నడిపించే రాజ్యాంగాన్ని రచించిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ను ప్రతి ఒక్కరూ గుర్తు చేసుకుని,ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని కిసాన్ పరివార్ సంస్థ సీఈవో డాక్టర్ వివేక్ అన్నారు. సోమవారం బీరిశెట్టిగూడెం గ్రామంలో అంబేద్కర్ విగ్రహ ప్రతిష్టాపనకు శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన సొంత ఖర్చులతో అంబేద్కర్ విగ్రహాన్ని ఇప్పిస్తానని హామీ ఇచ్చారు.అతి పెద్ద ప్రజాస్వామ్యమైన భారతదేశానికి రాజ్యాంగం రచించి దేశ ప్రజలందరికీ న్యాయం,స్వేచ్ఛ,సమానత్వంతో పాటు పేదలకు సంక్షేమ పథకాలను అందించేందుకు అంబేద్కర్ కృషి చేశారన్నారు.ఆయన ఆశయ సాధనలో ప్రతి ఒక్కరూ పాలుపంచుకోవాలని కోరారు.కార్యక్రమంలో మిడతపల్లి సురేందర్,మిడతపల్లి వెంకన్న, మిడతపల్లి వెంకటయ్య,భాస్కర్,ప్రవీణ్,వీరేంకులు తదితరులు పాల్గొన్నారు.

## పూసాలలో కార్తీక మాస సత్యనారాయణ వ్రతాలు



**సుల్తానాబాద్, నవంబర్ 11 (నినాదం న్యూస్):** పవిత్ర కార్తీక మాసాన్ని పురస్కరించుకొని పూసల మార్కండేయ దేవాలయంలో సామూహిక సత్య నారాయణ స్వామి వ్రతాలు ఘనంగా జరుపుకున్నారు. సోమవారం సుల్తానా బాద్ మండల కేంద్రం లోని పూసాల భక్త మార్కండేయ ఆలయం లో ని ర్వహిస్తున్న ఈ కార్య క్రమంలో తిరుమల తిరుప తి దేవస్థానము ఆధ్వర్యంలో వ్రతములోకూర్చు న్న 50 మంది దంపతులకు సత్యనారాయణ స్వా మి వారి ప్రతిమలను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ వలస నీలయ్య, నల్ల శంకర్ ,వలస భాస్కర్, పేగడ కిషన్,వలస రాజమౌళి, అ డిగొప్పుల లింగమూర్తి, నల్ల వెంకన్న, నల్ల రవి, ల తోపాటు పూజారులు సుంపటం కార్తికేయ ఆచా ర్యులు, దత్తాత్రేయ ఆచార్యులు, బోనాల కార్తీక్, ఆచార్యులు, రజనీకాంత్ ఆచార్యులు, రాజేష్ ఆచార్యులు,లతోపాటు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## కలెక్టర్ పై దాడి అమానుషం



**పెద్దపల్లి ప్రతినిధి, నవంబర్ 11( నినాదం న్యూస్):** వికారాబాద్ జిల్లా కలెక్టర్, ఇతర అధికారులపై దాడి చేయడం అమానుషమని టీజీఓ అసోసియేషన్ అధ్యక్షుడు తూము రవీందర్,కార్యదర్శి బహ్మానంద రెడ్డిలు తెలిపారు. సోమవారం పెద్దపల్లి జిల్లా కమిటీ అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల కోసం పనిచేసే అధికారులపై దాడి చేయడం దురదృష్టకరమన్నారు. దాడికి పాల్పడిన నిందితుల పై వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు.

## బెస్ట్ ఆర్గనైజేషన్ కోలేటి సతీష్ సేవలు అభినం దనీయం

-మాజీ చైర్మన్ కోలేటి దామోదర్

-ప్రభుత్వ పాఠశాలలో 1 లక్ష 50వేల విలువగల వస్తువులు పంపిణీ..



**సుల్తానాబాద్, నవంబర్ 11 (నినాదం న్యూస్):** బెస్ట్ రన్నర్ ఆర్గనైజేషన్ ఫౌండర్ కోలేటి సతీష్ సేవలు అభినందనీయమని పోలీస్ హౌసింగ్ కా ర్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ అన్నారు, సో మవారం సుల్తానాబాద్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులకు 1 లక్ష5 0వేల వి లువగల స్కూల్ బ్యాగ్స్, భోజన ప్లేట్లు,లైబ్రరీ పు స్తకాలు,రెండు డెస్క్ టాప్ కంప్యూటర్లు,ఒక జిరా క్స్ ప్రింటర్, సైన్స్ విద్య కోసం ఒక సూక్ష్మదర్శిని తో పాటు విద్యార్థులకు 2 బీరువాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కోలేటి దామో దర్ హాజరై మాట్లాడుతూ, బెస్ట్ ఆర్గనైజేషన్ ఫౌం డర్ కోలేటి సతీష్ సామాజిక సేవ కార్య క్రమాలు చేపట్టడం సంతోషమన్నారు.పేద విద్యార్థులకు ఉపయోగపడే వస్తువులు అందజేసిన వారి అభి నందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలోమాజీ స ర్పంచ్ అయిల రమేష్, సుల్తానాబాద్ పట్టణ ఆ ర్యవైశ్య సంఘం అధ్యక్షులు కొమురవెల్లి భాస్కర్, శివాలయం చైర్మన్ అల్లంకి సత్యనారాయణ, జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శారద, వాసవి క్లబ్ సభ్యులు,బెస్ట్ రన్నర్స్ఆర్గనైజేషన్ స భ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నేడు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

**మంథని టౌన్ నవంబర్ 11 (నినాదం న్యూస్ ):** మంథని మండలంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్నట్లు సీఈఓ అశోక్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని గంగాపురి, శ్రీపాద కాలనీ, అంగుళూర్,కన్నాల,ఖానాపూర్, వెంకటాపూర్, స్వర్ణపల్లి గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభానికి రైతులు, పాలకవర్గ సభ్యులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని ఆయన కోరారు.

## కాసులిస్తే కోరుకున్న చోటుకు..

### -జిల్లా విద్యాశాఖలో అక్రమ డిప్యుటేషన్లు

### -ఎంఈవో వద్దకు పంచాయితీ

**మహబూబ్‌నగర్** జిల్లా విద్యాశాఖలో ఉపాధ్యాయులకు అడ్డగోలుగా డిప్యుటేషన్లు ఇచ్చారు. గత ఇన్‌చార్జి డీఈవో డబ్బులు తీసుకొని ఉపాధ్యాయులను కోరుకున్న చోటుకు పంపించారు. ఉపాధ్యాయుడిని డిప్యుటేషన్‌పై పంపాలంటే ఆ స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సమావేశమై, అవసరం ఉన్న చోటకు పంపించాలి. అందుకు జిల్లా బాస్ అనుమతి తప్పనిసరిగా ఉండాలి. కానీ ఇక్కడ మాత్రం ఆ నిబంధనలను ఉల్లంఘించారు. జిల్లా వ్యాప్తంగా 193 మంది ఉపాధ్యాయులను డిప్యుటేషన్‌పై పంపగా, అందుకు సంబంధించిన వివరాలు తమ వద్ద లేవని డీఈవో కార్యాలయ అధికారులు చెప్పడం గమనార్హం.ఉన్నతాధికారుల ఆదేశాలు లేకుండా ఉపాధ్యాయులకు ఇష్టం వచ్చినట్లు డిప్యుటేషన్లు ఇచ్చారు. మొన్నటి వరకు ఇన్‌చార్జి డీఈవోగా పని చేసిన రవీందర్ ఒక్కో ప్లేస్‌కు ఒక్కో రేట్ తీసుకుని, డిప్యుటేషన్ ఇచ్చినట్లు ఆరోణలు వస్తున్నాయి. విద్యార్థుల అవసరం మేరకు పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉంటే, అక్కడ ఏ సబ్జెక్టు టీచర్ అవసరం ఉంది?, ఎవరిని పంపించాలి? అని జిల్లా బాస్ అనుమతి తీసుకుని సర్దుబాటు చేయాలి. కానీ మహబూబ్‌నగర్ జిల్లాలో నిబంధనలకు విరుద్ధంగా, ఉపాధ్యాయుల సౌకర్యం కోసం డిప్యుటేషన్లు ఇచ్చారు. జిల్లాలో మొత్తం 193 మంది డిప్యుటేషన్‌పై పని చేస్తున్నట్లు విద్యాశాఖ లెక్కలు చెబుతున్నాయి. ఇందులో ఎవరికీ డిప్యుటేషన్ ఇస్తున్నట్లు ఆదేశాలు లేవు. మౌకిక ఆదేశాల ప్రకారమే కొనసాగుతున్నారు.

**ఎంఈవో వద్దకు పంచాయితీ..**

మహబూబ్‌నగర్ అర్బన్ మండల పరిధిలో పనిచేసే ఓ ఉపాధ్యాయుడి అక్కడికి డిప్యుటేషన్‌పై వచ్చారు. ఆ పాఠశాలలో అవసం లేకున్నా ఇన్‌చార్జి డీఈవో మౌకిక ఆదేశాలతో ఆయన్ను చేర్చుకున్నారు. ఇన్‌చార్జి డీఈవో ఏసీబీకి పట్టుబడటంతో డిప్యుటేషన్‌పై వచ్చిన సదరు ఉపాధ్యాయుడిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సొంత స్కూల్‌కు వెళ్లాలని చెప్పారు.

# కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

**భీమదేవరపల్లి నవంబర్ 11 (నినాదం న్యూస్)**
హుస్నాబాద్ నియోజకవర్గంలోని భీమదేవరపల్లి మండలంలో ఉన్న గ్రామాలలో ,కళ్యాణ లక్ష్మి, సీఎం రిలీఫ్ ఫండ్ లబ్ధిదారులకు చెక్కులను కాంగ్రె స్ పార్టీ మండల అధ్యక్షుడు చిట్టెంపల్లి ఐలయ్య ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో భీమదేవరపల్లి మండలం ప్రభుత్వ అధికారైన రెవెన్యూ ఇన్స్పెక్టర్ రాజు, భీమదేవరపల్లి మండలం కాంగ్రెస్ అధ్యక్షులు చిట్టెంపల్లి ఐలయ్య, భీమ దేవరపల్లి మండలం యూత్ అధ్యక్షులు నారగోని నరేందర్, మల్లారం కాంగ్రెస్ అధ్యక్షులు సంపత్, భీమదేవరపల్లి కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులు తాళ్లపల్లి సదానందం,విశ్వనాథ కాలనీ కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులు వల్లెపు మహేందర్, గట్ల నర్సింగాపూర్ కాంగ్రెస్ అధ్యక్షులు పూర్ణచందర్, బొల్లనిపల్లి కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు బొల్లి సుమన్ ,మండల సీనియర్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, మాచర్ల కుమారస్వామి, పొన్నాల మురళి, తాళ్లపల్లి సదానందం, వెంకన్న పాల్గొన్నారు.



# మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

**భీమదేవరపల్లి నవంబర్ 11 (నినాదం న్యూస్)**
హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ ప్రజా గ్రంథాలయంలో సోమవారం అడ్వాన్స్ బ్యూటిషన్ ట్రైనింగ్ లో భాగంగా మహిళల ఎంపవర్మెంట్ అండ్ హెల్త్ ఇష్యూస్ పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎస్సార్ ఇంజనీరింగ్ సుమతి రెడ్డి కళాశాల ప్రిన్సిపల్ రాజశ్రీ వంగర ప్రభుత్వా సుపత్రి వైద్యులు డా. రుబీనా ఈ కార్యక్రమంలో పాలుపంచుకొని మహిళలు ఏ విధంగా మానసికంగా దృఢత్వాన్ని ఏర్పాటు చేసుకోవాలో వారికి ఉన్న అనుభవాలను మహిళకు వివరించారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని ప్రపంచంతో పోటీ పడాలని తన వ్యక్తిగత సమస్యలను కూడా ఏవిధంగా అధిగమించి ఎంతో మానసిక దృఢత్వాన్ని అలవర్చుకొని ఎలా ఈ స్థాయికి రావడం జరిగిందో చాలా సున్నితంగా వివరించారు. మహిళలు మానసికంగా దడత్వాన్ని కలిగి ఉంటారని చిన్న చిన్న సమస్యలకు చిన్న పోకూడదని తెలియజేశారు. డాక్టర్ రుబీనా మహిళల యొక్క అనారోగ్య సమస్యలు రాకుండా ఏ విధంగా జాగ్రత్తలు తీసుకోవాలో ముందే అరోగ్య సమస్యల పట్ల హెల్త్ చెక్ చేసుకోవాలని పరిసరాల పట్ల పరిశుభ్రంగా ఉంచుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో సుమతి రెడ్డి కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ మూల రాము గౌడ్ బ్యూటిషన్ ట్రైలర్ అనూష, డాక్టర్ ఏదులపురం తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



# పేద ప్రజలకు అండగా సీఎం రిలీఫ్ ఫండ్



**అల్వాల్, నవంబర్ 11 (నినాదం న్యూస్**
పేద ప్రజలకు అండగా సీఎం రిలీఫ్ ఫండ్ వెంకటాపురం నివాసికి చలపతికి 2 లక్షల ఎల్ వో సి చెక్కును ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి బోయిన్పల్లి క్యాంప్ కార్యాలయంలో అతనికి అందజేశారు. ఈ కార్యక్రమంలో అనిల్ కిషోర్ గౌడ్, మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, సంపత్, పాల్గొన్నారు

# జగత్ దాత్రి జగదాంబ వార్షికోత్సవాలు



**అల్వాల్, నవంబర్ 11(నినాదం న్యూస్)**
పట్టణ పరిధిలోని లోతుకుంటలో గల శుభశ్రీ గార్డెన్లో ఆదివారం శ్రీ జగదాంత్రి జగదంబ పూజ పదవ వార్షికోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీ ఈటెల రాజేందర్ పాల్గొన్నారు. ఎంపీ ఈటల రాజేందర్ కు కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ అర్బన్ జిల్లా బిజెపి ప్రధాన కార్యదర్శి గిరి వర్ధన్ రెడ్డి, అధ్యక్షులు బాబిఅధికారి, జనరల్ సెక్రెటరీ గోపి, గంగోలి, ఎస్.కె దెబ్బత్, తప్పన్, గంగోలి, ఆశిష్, బోస్, కొలను బోస్ ,చింతల మాణిక్య రెడ్డి, పాల్గొన్నారు.

## మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

**భీమదేవరపల్లి నవంబర్ 11 (నినాదం న్యూస్)**
హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం మల్లారం గ్రామంలో మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని మల్లారం గ్రామానికి చెందిన నాగిళ్ల రాజు అనే వ్యక్తి మధ్యానికి బానిసైనాడు,ఇతనికి భార్య ఇద్దరు పిల్లలు



ఉండగా గత కొంతకాలంగా భార్య తన పుట్టింటికి పిల్లలతో పాటు వెళ్ళింది.నాగిల్ల రాజు ఒంటరిగా ఉండలేక ఆదివారం తన వ్యవసాయ పొలం వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్య ప్రయత్నం చేయగా చుట్టుపక్కల వాళ్ళు గమనించి ఆసుపత్రిలో తరలించారు. హాస్పిటల్లో చికిత్స పొందుతూ సోమవారం మరణించాడు. మృతుని భార్య నాగిళ్ల సుజాత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ముల్కనూర్ ఎస్సై సాయిబాబు తెలిపారు.

# మౌలానా అబుల్ కలాం జీవితం ఆదర్శం

**- మైనార్టీ గురుకులంలో**
**కలాం జయంతి**

**కారేపల్లి నవంబర్ 11 నినాదం న్యూస్**
భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం జీవితం ఆదర్శమని కారేపల్లి ఎస్సై ఎన్.రాజారాం అన్నారు. సోమవారం కారేపల్లి ఎస్ఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న మైనార్టీ గురుకులంలో అబుల్ కలాం జయంతిని నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ సమాజాభివృద్ధి విద్య ప్రాముఖ్యతను కలాం తెలియ చెప్పారన్నారు. నాణ్యమైన విద్య కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టి గురు కులాలను వినియోగించుకోని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. ఈసందర్భంగా జేఎన్టీయూహెచ్లో సీటు సాధించి సీఎం రేవంత్రెడ్డి చేతుల మీదిగా ప్రశంసపత్రం తీసుకున్న పూర్వ విద్యార్థి ఎస్డీ అసియాను ఎస్సై అభినందించారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్కెలజా, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు మేదరి వీరప్రతాఫ్, మైనార్టీ నాయకులు ఎండి యాకుబ్ అలీ, మతీన్, తాజుద్దీన్, షఫీ అధ్యాపకులు పాల్గొన్నారు.



# విజయవంతమైన స్కూల్ ఆఫ్ వండర్ కిడ్స్ స్టడీ హబ్ !

**విశాఖ,నవంబర్ 11 నినాదం న్యూస్ :**

ఈ నెల 7వ తేదీ నుంచి 11వ తేదీ వరకు నగరంలోని మద్దిలపాలెం కళాష్ణా కాలేజ్ రోడ్ స్కూల్ ఆఫ్ వండర్ కిడ్స్ లో నిర్వహించిన స్టడి హబ్ విజయవంతంగా ముగిసింది. దీనికి తెలంగాణలోని వివిధ ప్రాంతాల నుండి 9 మంది స్కూల్ హెడ్‌లు, 80 మంది ఉపాధ్యాయులు హాజరై స్కూల్ ఆఫ్ వండర్ కిడ్స్ పాఠశాలలో పుస్తకాలు లేకుండా పిల్లలకు బోధిస్తున్న అత్యాధునిక బోధనా పద్ధతులు, వినూత్న విధానాలు, ఉత్తమ అభ్యాసాలను స్వయంగా వీక్షించారు. కేజీ స్థాయి పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం 21వ శతాబ్దపు నైపుణ్యాలను పెంపొందించడానికి ఈ పాఠశాలలో అవలంభిస్తున్న ఎడ్యూ ఈజీ కాన్సెప్ట్ ను అందరూ అభినందించారు. పాఠశాల విద్యార్థుల నైపుణ్యాలను, పనితీరును నిశితంగా పరిశీలించడానికి ప్రీ కేజీ నుండి 7వ తరగతి వరకు ప్రతి తరగతికి వెళ్లి వారితో ఇంటరాక్ట్ అయ్యారు.



ఇందులో విద్యార్థుల మేధో ప్రదర్శన, సమాధానమిచ్చిన తీరు చూసి ఆహూతులందరూ సంతఅప్తి వ్యక్తం చేశారు. ప్రాథమిక అంశాలు, కమ్యూనికేషన్ స్కిల్స్‌లో ప్రాథమిక పరిజ్ఞానాన్ని పొందిన ప్రీకేజీ పిల్లలు 500 ప్రశ్నలకు సమాధానాలు చెప్పి అందరినీ ఆకట్టుకు న్నారు.

ఎల్కేజి పిల్లలు పలు సాధారణ ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు, సాధారణ గణితం, భారతదేశ పటంలోని అన్ని రాష్ట్రాలను, వాటి రాజధానులు, భౌగోళిక స్వభావాలతో గుర్తించి, ప్రేక్షకులను ఆశ్చర్య పరిచారు. యుకెజి పిల్లలు ప్రపంచ పటంలోని అన్ని దేశాలను వారి రాజధానులతో పాటు గుర్తించడమే కాకుండా ది హిందూ వార్తాపత్రిక నుండి కథనాన్ని చదవారు. గణిత గణనలు, ఇంగ్లీష్ మరియు జనరల్ సైన్స్‌లో కూడా మంచి ప్రతిభ కనబరిచారు. అనంతరం స్కూల్ ఆఫ్ వండర్ కిడ్స్ డైరెక్టర్ మళ్ల రాము నాయుడు, ప్రిన్సిపాల్ వాణి శ్రీ వారి కుమార్తె మళ్ల శర్వాణి తరగతి గదిలో విద్యార్థులతో సులువుగా మరియు వినూత్నంగా ఎలా వ్యవహ రించాలో శిక్షణా తరగతులను నిర్వహించారు. దీనికి హాజరైన వివిధ పాఠశాలల ప్రధానో పాధ్యాయులు తమ తమ పాఠశాలల్లో ఇదే పద్ధతిని అమలు చేసా_మన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్. మధు సూదన్, ప్రధాన కార్యదర్శి రమేష్ రావ్, కమిటి సలహాదారు గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వైకాపా సోషల్ కార్యకర్తల అరెస్ట్

## మీడియా ముందుకు వర్రా రవీందర్‌రెడ్డితో మరో ఇద్దరు



**కడప, నవంబర్ 11 నినాదం న్యూస్**

అసభ్యకర పోస్టుల కేసులో అరెస్టయిన వైకాపా సోషల్ మీడియా కార్యకర్త వర్రా రవీందర్‌రెడ్డితోపాటు మరో ఇద్దరు నిందితులు సుబ్బారెడ్డి, ఉదయ్‌లను పోలీసులు మీడియా ఎదుట ప్రవేశపెట్టారు. కేసుకు సంబంధించిన వివరాలను కోయా ప్రవీణ్, కడప ఎస్పీ విద్యాసాగర్ నాయుడు విరీడియాకు వివరించారు. 'సీఎం చంద్రబాబు , డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, హెూం మంత్రి అనిత తదితరులపై అసభ్యకర పోస్టుల కేసులో నిందితులను పట్టుకునేందుకు బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టినట్లు కర్నూల్ రేంజ్ డీఐజీ కోయా ప్రవీణ్ తెలిపారు. ఆదివారం మార్కాపురం సవిరీపంలో నిందితులను అదుపులోకి తీసుకున్నామన్నారు. నిందితులు వాడిన భాష అసభ్యకరంగా ఉంది. అరబ్ దేశాల్లో అయితే తీవ్ర శిక్షలు ఉంటాయి. సీఎం, డిప్యూడీ సీఎం కుటుంబాలపై తీవ్రమైన దూషణలు వాడారు. వర్రా రవీందర్‌రెడ్డి గతంలో భారతి సిమెంట్స్‌లో పని చేశాడు. మరో ఇద్దరు కూడా వైకాపా సోషల్ విరీడియాలో పని చేస్తున్నారు. డిజిటల్ కార్పొరేషన్ ఉద్యోగులను వైకాపాకి అనుకూలంగా వినియోగించుకున్నారని నిందితులు తమ వాంగ్మూలంలో చెప్పారు. న్యాయమూర్తులకు వ్యతిరేకంగా కూడా పోస్టులు పెట్టారు. మహిళా కుటుంబసభ్యులు, వారి పిల్లలపై పోస్టులు పెట్టారు. ఇలాంటి వారిని 45 మందిని గుర్తించాం. నిందితులపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశాం. నాయకుల ఫొటోలు మార్ఫింగ్ చేసి పోస్టులు పెట్టేవారు. నిందితులకు 40 యూట్యూబ్ ఛానెళ్లు ఉన్నట్లు గుర్తించాం. వాటి ద్వారా అసభ్యకర వ్యాఖ్యలు చేసేవారు. తాడేపల్లిలోని వైకాపా కార్యాలయం నుంచి వీటిని నడిపేవారు. జిల్లా కన్వీనర్ ఆధ్వర్యంలో వీరంతా పని చేసే వారు. తాడేపల్లిలోని పీవీఆర్ ఐకాన్ బిల్డింగ్ నుంచే పోస్టులు పెట్టేవారు. అధికారంలో ఉన్న మహిళా నేతలనే టార్గెట్ చేసుకొని పోస్టులు పెట్టారు. నిందితులు ఇచ్చిన వాంగ్మూలాన్ని లోతుగా పరిశీలించాల్సి ఉంది. వారు పెట్టిన పోస్టులను సాధారణంగా చదవలేం. సభ్య సమాజం అసహ్యించుకునేలా వారి పోస్టులు ఉన్నాయి. మహిళలపై ఇలాంటి పోస్టులు పెట్టిన వారిని రాక్షసజాతికి చెందినవారిగా భావిస్తున్నామని ప్రవీణ్ వివరించారు.

# గత పాలనలో విధ్వంసంతోనే ఇప్పుడు కష్టాలు

## వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

**అమరావతి, నవంబర్ 11 నినాదం న్యూస్**

2024-25 ఆర్థిక సంవత్సరానికి గాను వార్షిక బడ్జెట్‌ను ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ఏపీ అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా గత ప్రభుత్వ పాలనపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అన్ని రంగాలను గత వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని విమర్శించారు. విధ్వంసంతోనే వైసీపీ పాలన నడిరచిందని అన్నారు. గత ప్రభుత్వ పాలన లో అన్ని రంగాల్లోనూ విధ్వంసం చోటు చేసుకుందన్నారు. ఏపీ ఆర్థిక వ్యవస్థ పతనమయ్యేలా చేశారని మండిపడ్డారు. రాష్ట్రానికి రాజధాని లేకుండా చేశారన్నారు. గత ప్రభుత్వం లోపభూయిష్ట విధానాలను అమలు చేసిందని వ్యాఖ్యలు చేశారు. ఏపీ ప్రజలు అపురూపమైన తీర్పు ఇచ్చారన్నారు. 2019-24 మధ్య రాష్ట్రంలో చీకటి దశ నడిచిందంటూ మంత్రి కామెంట్స్ చేశారు. వైసీపీ పాలన విధ్వంసంతోనే ప్రారంభమైందన్నారు. రాష్ట్ర బ్రాండ్ విలువను దెబ్బతీశారన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు రానీయకుండా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర పథకాలను దారి మళ్లించారని ఆరోపించారు. అలాగే కార్పొరేషన్ల నిధులను కూడా మళ్లించారన్నారు. గత ప్రభుత్వంపై గుత్తేదారులకు నమ్మకం పోయిందని.. గత ప్రభుత్వంలో పరిమితికి మించి అప్పులు చేశారని తెలిపారు. గత ప్రభుత్వం ప్రజాస్వామ్య గొంతులను అణచివేసిందని.. వైసీపీ సర్కార్ నిర్వాకంతో ఆర్థిక గందరగోళ పరిస్థితులు నెలకొన్నయన్నారు. పతనం అంచున రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ నిలుచుందన్నారు. రాష్ట్ర ప్రగతి పునర్నిర్మాణం నేటితరం చేతుల్లో ఉందన్నారు. ప్రభావవంత పాలనే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. గత వైసీపీ ప్రభుత్వ లోపభూయిష్ట విధా నాల వల్ల రాష్ట్ర ఆదాయానికి గండి పడిరదని విమర్శించారు. సాగునీటి రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేశారని.. పోలవరం ప్రాజెక్టు అథారిటీ [illegible] పట్టించుకోలేదన్నారు. ఏళ్ల తరబడి పోలవరం ప్రాజెక్టును గాలికొదిలేశారని మండిపడ్డారు. ఏపీ అభివృద్ధి కుంటుపడకుండా చూస్తామని వెల్లడిం చారు. సంక్షేమానికి పెద్దపీట వేస్తూ బడ్జెట్ రూపొం దించినట్లు తెలిపారు. పట్టణాల్లో 204, గ్రామీణ ప్రాంతాల్లో 158 అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేశామన్నారు. వీల్కెనంత త్వరగా పోలవరం పూర్తి చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. ప్రపంచస్థాయి నగరంగా అమరావతి నిలవనుందని మంత్రి పయ్యావుల పేర్కొన్నారు.



# శివనామస్మరణతో శ్రీశైల మహాక్షేత్రం

**అమరావతి, నవంబర్ 11 నినాదం న్యూస్**

శ్రీశైల భ్రమరాంబికా మల్లికార్జున స్వామి అమ్మవార్లను దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో పుర వీధులన్నీ కిటకిటలాడాయి. కార్తీక మాస శోభను సంతరించుకున్న శ్రీశైల మహాక్షేత్రం శివనామస్మరణతో మార్మోగింది. వరుసగా వారాంతపు సెలవులు కలిసి రావడంతో కుటుంబసమేతంగా క్షేత్రానికి చేరుకుంటున్నారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన యాత్రికులు తెల్లవారుజామునే తలనీలాలు సమర్పించుకుని. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గంగాధర మండపం, ఉత్తర మాడవీధి వద్ద దీపాలు వెలిగించుకొని పూజలు చేసుకొన్నారు. అనంతరం భక్తులు స్వామి అమ్మవార్ల దర్శనాలకు బారులుదీరుతూ ఉచిత దర్శనానికి రెండు గంటలు, శీఘ్ర, అతిశీఘ్ర దర్శనానికి గంట సమయం పడుతున్నట్లు పీఆర్వో శ్రీనివాసరావు తెలిపారు. ఆలయ మాడవీధిలో సాయత్రం కళాకారులు చేసిన సంప్రదాయ నృత్యాలు అందరినీ అలరించాయి. శని, ఆదివారాల్లో క్షేత్రానికి తరలివచ్చిన భక్తులు కుటుంబ సభ్యులతో బస చేసేందుకు సదుపాయాలు లభించక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దేవస్థాన వసతి గృహాలతో పాటు నిత్యాన్నదాన సత్రాల్లో అద్దె గదులు, డార్మెటరీలు లభించక పోవడంతో ఉద్యానవనాలు, ఫుట్‌పాత్‌లపై నిద్రించడం కష్టంగా ఉందని భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యేక పర్వ దినాల్లో సామాన్య భక్తులు కూడ బస చేసేందుకు వీలుగా ప్రత్యేక వసతి సదుపాయాలను కల్పించాలని యాత్రికులు కోరుతున్నారు.





# ట్రెడ్ మిల్ పై రక్త పిశాచి గబ్బిలాల పరుగు..

## మన మేలు కోసమే.. ఎందుకలా?

**హైదరాబాద్, నవంబర్ 11 (నినాదం న్యూస్)**
కేవలం రక్తం మాత్రమే తాగి బతికే వాంపైర్ బ్యాట్స్ .సరైన పోషకాలు లేకుండా వాటికి శక్తి ఎలా వస్తుందని శాస్త్రవేత్తల పరిశోధన పోషకా హార లోపం, ఔషధాల రూపకల్పనకు తోడ్పడే ప్రయోగం. గబ్బిలాలను చూస్తే చాలా మంది భయపడతారు. వాటి ఆకారం, రాత్రిపూట తిరగడం, చిన్నప్పుడు మన పెద్దవాళ్లు చెప్పే కథలు వంటివి దానికి కారణం. ఇలాంటి గబ్బిలాలలో కేవలం జంతువుల రక్తం తాగి బతికేవి 'వాంపైర్ బ్యాట్స్'... అంటే రక్తపిశాచి గబ్బిలాలు అనొచ్చు. శాస్త్రవేత్తలు ఆ గబ్బిలాలను ఓ చిన్నపాటి ట్రెడ్ మిల్‌పై పరుగెత్తిస్తున్నారు. మనకు మేలు చేసే కొన్ని అంశాలను గుర్తించేందుకు ప్రయోగం చేస్తున్నారు.

**అన్ని రకాల పోషకాలు అందకుంటే...**
మామూలుగా జంతువులేవైనా బతకడానికి శక్తి అవసరం. తినే ఆహారం ద్వారా ఈ శక్తి అందుతుంది. దాదాపు అన్ని రకాల జంతువులు కూడా కొంచెం అటూ ఇటూగా శరీరానికి అన్ని పోషకాలు అందించే ఆహారం తీసుకుంటాయి. కార్బోహైడ్రేట్లు, ప్రొటీన్లు, విటమిన్లు, కొవ్వు పదార్థాలు, అమైనో యాసిడ్స్ వంటివన్నీ ఆ



ఆహారం ద్వారా శరీరానికి అందేలా చూసుకుంటాయి. అన్ని పోషకాలు అందకపోతే... ఆరోగ్యం దెబ్బతింటుంది. వివిధ వ్యాధులు వస్తాయి. ఆ జీవులు కృశించిపోతాయి. ఈ విషయంలోనే వాంపైర్ బ్యాట్స్ లో తేడాను శాస్త్రవేత్తలు గుర్తించారు.

**వాంపైర్ గబ్బిలాలపై ప్రయోగం ఎందుకు?**
వాంపైర్ గబ్బిలాలు కేవలం జంతువుల రక్తం మాత్రమే తాగుతూ బతికేస్తాయి. వేరే ఆహారం ఏదీ తీసుకోవు. అలాంటప్పుడు వాటికి పోషకాహార లోపం రావాలి కదా, సాధారణంగా జంతువుల్లో కార్బోహైడ్రేట్ల ద్వారా శక్తి ఉత్పన్నం అవుతుంది. రక్తంలో కార్బోహైడ్రేట్లు చాలా తక్కువ. ప్రొటీన్లు, అమైనో యాసిడ్స్ ఎక్కువ. మరి వాటిలో శక్తి ఎలా ఉత్పత్తి అవుతుందన్న ప్రశ్న తలెత్తింది. ఇది తేల్చేందుకే టొరొంటో స్కార్బోరో యూనివర్సిటీ శాస్త్రవేత్తలు శాస్త్రవేత్తలు వాంపైర్ బ్యాట్స్ పై ప్రయోగం మొదలుపెట్టారు.

**ట్రెడ్ మిల్ పై పరుగు పెట్టించడం ఎందుకు?**
జీవులేవైనా పరుగెత్తినప్పుడు వాటి శరీరంలో శక్తి వేగంగా ఖర్చవుతుంది. దీనితో ఆహారం నుంచి శక్తి ఉత్పత్తి పెరుగుతుంది. అందుకే శాస్త్రవేత్తలు వాంపైర్ బ్యాట్ లను ప్రత్యేకమైన ట్రెడ్ మిల్ పై పరుగులు పెట్టించారు. వాటి శరీరంలో శక్తి ఎలా ఉత్పత్తి అవుతోంది, ఏ రకమైన పోషకాల నుంచి వస్తోందన్నది పరిశీలించారు.

**ఈ ప్రయోగంతో మనుషులకు లాభమేంటి?**
వాంపైర్ గబ్బిలాల శరీరం పోషకాలను అవసరానికి తగినట్టుగా ఎలా వినియోగించుకుంటుందో పూర్తిగా తేల్చితే... మనుషులలో పోషకాహార సమస్యలకు చెక్ పెట్టే విధానాలు, ఔషధాల రూపకల్పనకు తోడ్పడుతుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

సాధారణంగా మనలో ఎంజైముల ఉత్పత్తికి అమైనో యాసిడ్స్ దోహదం చేస్తాయి. కానీ వాంపైర్ బ్యాట్స్ లో అవి నేరుగా జీర్ణమై శక్తిని ఇస్తున్నాయి. ఈ విధానాన్ని లోతుగా అధ్యయనం చేస్తే... శరీరంలో, ఆహారంలో మార్పులు, తగిన మందుల తయారీ చేపట్టవచ్చని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు.

# పుష్ప-2.. అగరబత్తి చూశారా?

**హైదరాబాద్, నవంబర్ 11 (నినాదం న్యూస్)**
టాలీవుడ్ ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, లెక్కల మాస్టర్ సుకుమార్ కాంబోలో తెరకెక్కుతున్న పుష్ప-2 కోసం బన్నీ ఫ్యాన్స్ తో పాటు సినీ ప్రియులు వేయి కళ్లతో ఎదురు చూస్తున్న విషయం తెలిసిందే. ఫస్ట్ పార్ట్ బ్లాక్ బస్టర్ హిట్ అవ్వడంతో సీక్వెల్ పై అంతా భారీ అంచనాలు పెట్టుకున్నారు. పుష్పకు మించిన హిట్ అవుతుందని ఫిక్స్ అయిపోయారు. డిసెంబర్ 5వ తేదీన రిలీజ్ కానున్న పుష్ప-2 నుంచి ఇప్పటికే మేకర్స్ రిలీజ్ చేసిన సాంగ్స్, టీజర్, గ్లింప్స్.. ఆడియన్స్ నుంచి మంచి రెస్పాన్స్ అందుకున్నాయి. సినిమాపై పాజిటివ్ బజ్ క్రియేట్ చేశాయి. ఇప్పుడు అంతా ట్రైలర్ కోసం వెయిట్ చేస్తున్నారు. రీసెంట్ గా మేకర్స్.. ట్రైలర్ రిలీజ్ డేట్ ను అనౌన్స్ చేశారు. నవంబర్ 17న విడుదల చేస్తామని తెలిపారు. అయితే రీసెంట్ గా మేకర్స్.. పుష్ప-2 ది బిగ్గెస్ట్ కొలబరేటింగ్ మూవీ అంటూ ట్వీట్ చేసిన విషయం తెలిసిందే. దేశంలోని అనేక ప్రముఖ వ్యాపార సంస్థలు సహకారం అందిస్తున్నట్లు తెలిపారు. బ్రాండ్ల పేర్లను కూడా రివీల్ చేశారు. ఈ నేపథ్యంలో మంగళ్ దీప్ అగరబత్తి కంపెనీ.. అల్లు అర్జున్ పుష్ప గెటప్ పిక్ తో కొత్త అగరబత్తి ప్యాకెట్ ను విడుదల చేసింది. దానిపై లిమిటెడ్




ఎడిషన్ రాసుకొచ్చింది మంగళ్ దీప్ కంపెనీ. దీనికి సంబంధించి నెల రోజుల క్రితం యాడ్ ను విడుదల చేసింది. ఇప్పుడు పుష్ప-2 సినిమాకు డివోషనల్ పార్ట్నర్ అని చెప్పింది. పుష్ప-2 టైటిల్, పుష్ప రాజ్ పిక్ తో అగరబత్తి ప్యాకెట్స్ ను రిలీజ్ చేసింది. ఆ పిక్చర్ ను అల్లు అర్జున్ సతీమణి స్నేహ రెడ్డి తాజాగా షేర్ చేశారు. పుష్ప-2 లిమిటెడ్ ఎడిషన్ అగరబత్తి ప్యాకెట్ ఫోటోను ఇన్ స్టాగ్రామ్ స్టోరీలో పోస్ట్ చేశారు. దీంతో స్నేహ పోస్ట్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. అల్లు అర్జున్ అభిమానులు.. మంగళ్ దీప్ పుష్ప-2 లిమిటెడ్ ఎడిషన్ పిక్ ను షేర్ చేస్తున్నారు. నెట్టింట ఫుల్ ట్రెండ్ చేస్తున్నారు. కొందరు పుష్ప 2 క్రేజ్ తో మంగళ్ దీప్ అగరబత్తి సేల్స్ పెరుగుతాయని అంటున్నారు. ఇక సినిమా విషయానికొస్తే.. సుకుమార్ దర్శకత్వం వహిస్తున్న పుష్ప సీక్వెల్ ను మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై రవిశంకర్, నవీన్ గ్రాండ్ గా నిర్మిస్తున్నారు. సీక్వెల్ లో కూడా నేషనల్ క్రష్ రష్మిక హీరోయిన్ గా నటిస్తున్నారు. స్పెషల్

# మరోసారి తగ్గిన పసిడి-వెండి రేట్లు

**హైదరాబాద్, నవంబర్ 11 (నినాదం న్యూస్)**
దేశవ్యాప్తంగా బంగారం, వెండి ధరలు మరోసారి తగ్గాయి. ఇప్పటికే పసిడి రేట్లు నిదానంగా తగ్గుతుండటంతో కొనుగోలుదారులు నగల దుకాణాల వైపు చూసేందుకు ఆసక్తి చూపుతున్నారు. అయితే బంగారం, వెండి ధరలు సూచనప్రాయంగా తెలుపబడుతున్నవి. వీటిపై జీఎస్టీ, టీసీఎస్, ఇతర పన్నులు, సుంకాలు అదనంగా ఉండవచ్చు. కచ్చితమైన ధరల కోసం స్థానిక నగల దుకాణాల్లో సంప్రదించాల్సి ఉంటుంది. సోమవారంనాటి ధరలు చూస్తే %ా% తెలుగు రాష్ట్రాలోని హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ సహా వివిధ ప్రాంతాల్లో 22 క్యారెట్ల బంగారం తులం (10 గ్రాములు) ధర రూ.550 తగ్గి రూ.72,200 లకు వచ్చింది. అలాగే 24 క్యారెట్ల బంగారం రూ.600 క్షీణించి రూ. 78,760 లకు తగ్గింది. బెంగళూరు, చెన్నై, ముంబై ప్రాంతాలలోనూ ఇదే స్థాయిలో ధరలు తగ్గాయి. మరోవైపు దేశ రాజధాని ఢిల్లీలోనూ బంగారం ధరలు తగ్గుదలను నమోదు చేశాయి. 22 క్యారెట్ల బంగారం రూ.550 తగ్గి రూ.72,350 వద్దకు, 24 క్యారెట్ల బంగారం రూ.600 తగ్గి రూ.78,910 వద్దకు దిగొచ్చింది. దేశంలో వెండి ధరలు కూడా నేడు తగ్గుముఖం పట్టాయి. హైదరాబాద్‌లో కేజీ వెండిపై రూ.1000 తగ్గి రూ.1,02,000 వద్దకు చేరింది.

## భక్తులతో కిటకిటలడిన శివాలయాలు



**అల్వాల్, నవంబర్ 11 (నినాదం న్యూస్)**
కార్తీక్ మాసం రెండవ సోమవారం పురస్కరించుకొని శ్రీ ఉమా చంద్రమౌళీశ్వర ఆలయంలో ఉదయం నుండే భక్తులతో కిటకిటలాడాయి. శివునికి అభిషేకాలు కార్తీకదీపం వెలిగిస్తూ భక్తులతో ఆలయాలు సందడి సందడిగా కనిపించాయి.

# ఘనంగా ఆర్గానిక్ వరల్డ్ స్టోర్ ప్రారంభోత్సవం



**అల్వాల్, నవంబర్ 11 (నినాదం న్యూస్)**
అల్వాల్ హై టెన్షన్ రోడ్డు లోని ది ఆర్గానిక్ వరల్డ్ స్టోర్ ను ముఖ్యఅతిథిగా పాల్గొన్న బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కల్వకుంట్ల వంశీధర్ రావు ఘనంగా ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా స్టోర్ నిర్వాహకులను అభినందించి శుభాకాంక్షలు డోలి రమేష్, నక్క శేఖర్ గౌడ్, సతీష్ మణికొండ , పర్వత లేని శ్రీధర్ రావు, కొంపల్లి సాయి కరణ్ గౌడ్ పాల్గొన్నారు.

# మారుతి సుజుకి కొత్త డిజైర్ విడుదల

**హైదరాబాద్, నవంబర్ 11 (నినాదం న్యూస్)**
దేశంలోనే అతిపెద్ద కార్ల తయారీ కంపెనీ మారుతి సుజుకి సరికొత్త డిజైర్ 2024ను విడుదల చేసింది. నాలుగోతరం డిజైన్‌తో పాటు ఫీచర్లు, ఇంజిన్‌లోనూ పలు మార్పులు చేసినట్లు ఆ కంపెనీ వెల్లడించింది. ఎక్స్‌షోరూం వద్ద దీని ప్రారంభ ధరను రూ.6.79 లక్షలుగా నిర్ణయించింది. మారుతి సుజుకిలో 5 స్టార్ రేటింగ్ పొందిన తొలి కారు ఇదే కావడం విశేషం. ఆరు ఎయిర్ బ్యాగ్‌లు, మారుతీ జెడ్ సిరీస్ 1.2 లీటర్ త్రీ సిలిండర్ పెట్రోల్ ఇంజిన్‌ను అమర్చింది. మాన్యువల్ వేరియంట్‌లో లీటర్‌కు 24.79 కిలోమీటర్ల మైలేజీ, ఎఎంటి వేరియంట్ లీటర్‌కు 25.71 కిలోమీటర్లు మైలేజీ ఇస్తుందని ఆ కంపెనీ పేర్కొంది.

